www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల

20

శనివారం • 5-8-2017



రోగులకు ఎలాంటి ఇబ్బందీ కలగవద్దు



ఐసీయూలో రోగి పరిస్థితి తెలుసుకుంటున్న కలెక్టర్ కర్ణన్

- ఐసీయూలో అన్ని సౌకర్యాలు కల్పించండి
- వైద్యులతో కలెక్టర్ ఆర్వీ కర్ణన్
- ప్రభుత్వ ఏరియాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు
- బ్లడ్ బ్యాంకు, పిల్లలవార్డు పరిశీలన

9

కమ్ముకుంటున్న కరువు మేఘాలు



ముల్కల్లలో బీడుగా మారిన భూముల్లో మేస్తున్న పశువులు

జిల్లాపై కరువుమేఘాలు కమ్ముకుంటున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు అన్నదాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆగస్టు 4వరకు జిల్లా సగటు వర్షపాతం 552.8 మిల్లీమీటర్లు కాగా, కేవలం 341.9 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే 210.9 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నెలకొన్నది. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు చేరలేదు. ఫలితంగా వాటి కింద ఆయకట్టు భూముల్లో నాగలి చాలు పడలేదు. మరోవైపు 1,46,304 ఎకరాల వర్షాధార భూముల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే 80వేల ఎకరాల్లో పత్తి వేయగా, అల్లుముఖం పట్టింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కొద్దిరోజుల్లో వేసిన పంటలన్నీ ఎండిపోయే ప్రమాదముంది. ఇదే జరిగితే జిల్లా రైతాంగానికి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతుంది.

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల

మధ్య పేజీల్లో..

ప్రాణం తీసిన భూవివాదం



దశరథం (ఫైల్)

- యువకుడి దారుణ హత్యతో బెల్లంపల్లి మండలం చిన్నబూదలో కలకలం
- టీఆర్ఎస్ నేత ప్రోద్బలం వల్లే హత్య జరిగిందని కుటుంబసభ్యుల ఆరోపణ
- ఏసీపీ కార్యాలయం ఎదుట రాస్తారోకో
- నిందితుల ఇంటిపై దాడి.. సామగ్రికి నిప్పు
- బాధ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్

3

ఆంధ్రజ్యోతి పరిశీలన

కాటికి దగ్గర కూ(గూ)టికి దూరం!

- తరుముతున్న కన్నబిడ్డలు
- అలమటిస్తున్న పండుటాకులు
- చరమాంకంలో ఒంటరి పోరు
- జిల్లాలో పెరుగుతున్న ఘటనలు

ఓ కవి చెప్పినట్లు, 'ఆత్మీయత, అనుబంధం అంతా బూటకం, నాటకమే' అవుతున్నది. కాటికి కాళ్లు జాపిన వయస్సులో కన్నబిడ్డలు తరుముతుంటే పండుటాకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. కూడు, గూడు కరువై, ఆకలితో అలమటిస్తున్న వృద్ధుల సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నది. 'నా.. ' అన్నవారి నడుమ ఆనందంగా గడవాల్సిన జీవిత-చరమాంకం కాస్తా, చుట్టుముడుతున్న రోగాలు, ఆర్థికసమస్యలతో పెనుభారంగా సాగుతున్నది.

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల

9



మంచిర్యాలలోని ఓ వృద్ధాశ్రమంలో వృద్ధులు

ఇంటర్వ్యూ
I.N.T.E.R.V.I.E.W

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా

ప్రత్యామ్నాయ ప్రణాళిక

- దాదారావు, మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి



నెన్నెల : జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా వరికి ప్రత్యమ్నయంగా సాగు చేసే పంటల కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తు న్నామని జిల్లా వ్యవసాయాధికారి దాదారావు పేర్కొన్నారు. వరినాట్లు వేసుకునేందుకు మరో వారం, పది రోజుల సమయం ఉన్నదనీ, అప్పటికీ వానలు కురవకపోతే జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చర్యలు తీసుకుంటామని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో పంటల పరిస్థితి ఎలా ఉంది ?

అధికారి : జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతున్నది. చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు లేక వరి నాట్లు వెనుకబడ్డాయి. మరో వారం, పది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే 70 శాతం వరి నాట్లు పడవు. పత్తి పంటకు కూడా నష్టం వాటిల్లే అవకాశాలున్నాయి.

ఆంధ్రజ్యోతి : వరి నారుమడులు ముదిరిపోతున్నాయి. 40 రోజులు దాటాక నాటువేస్తే ఆశించిన దిగుబడి వస్తుందా?

అధికారి : వరి నారు ముదిరితే దిగుబడి కొంత తగ్గే అవకాశం ఉంది. నారు ముదిరిన రైతులు మళ్లీ విత్తనాలు చల్లుకుంటున్నారు. 2014లో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నప్పుడు అక్టోబరు నెలాఖరులో వర్షాలు కురవడంతో అప్పట్లో పంటలు పండాయి. నారు అందుబాటులో ఉండి నీరుంటే ఎప్పుడైన వరి నాట్లు వేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి : ప్రత్యామ్నయ పంటల కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

అధికారి : వరికి ప్రత్యమ్నయంగా సాగు చేసే పంటల కోసం కార్యాచరణ రూపొందిస్తున్నాం. కావాల్సిన విత్తనాల ఇండెంట్‌ను రూపొందించి రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిస్తాం.

ఆంధ్రజ్యోతి : ప్రత్యామ్నయంగా ఏ పంటలు వేసుకోవాలి ?

అధికారి : వరి నాట్లు పడకపోతే మక్క, కంది, జొన్న, పొద్దు తిరుగుడు, వేరుశనగ పంటలు సాగు చేసుకోవచ్చు. కావాల్సిన విత్తనాలు సబ్సిడీపై సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నాం. గ్రామాల్లో ఆరుతడి పంటలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో వ్యవసాయ యంత్రీకరణ పథకం అమలవుతున్నదా?

అధికారి : గత ఆర్థిక సంవత్సరంలో 30 నుంచి 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందజేశాం. ఈ సంవత్సరానికి బడ్జెట్ రావాల్సి ఉన్నది.



సెర్ప్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ (ఫైల్)

క్రమబద్ధీకరణ ఎప్పుడు?

- చాలీచాలని వేతనాలతో సెర్ప్ సిబ్బంది పాట్లు
- పట్టించుకోని సర్కారు
- ఆపరేటర్లు, అకౌంటెంట్ల సమ్మె బాట

నెన్నెల : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్ల సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదు. నెలల తరబడి జీతాలు అందక వారి కుటుంబాలు దుర్భర జీవితాలు గడుపుతున్నాయి. ఎప్పటికైనా క్రమబద్ధీకరించకపోతారా అనేఆశతో ఏళ్లతరబడి చాలీచాలని వేతనాలతో ఊడిగం చేస్తున్నారు. హెచ్‌ఆర్ ఎంప్లాయిస్‌గా గుర్తించి రెగ్యూలర్ చేస్తామని ఇచ్చిన హామిని ప్రజాప్రతినిధులు, అధికారులు మర్చిపోయారు. ప్రభుత్వాలు మారినా మండల సమాఖ్యల ఆధ్వర్యంలో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్ల బతుకులు మారడం లేదు.

● అంతంత మాత్రంగానే జీతాలు

మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఏర్పాటైంది. మండలాలవారీగా కార్యాలయాలను ఏర్పాటుచేసి, సేవలను విస్తరించారు. ఇందులో భాగంగా ఏపీఎం, సీసీలతో పాటు అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. జిల్లా వ్యాప్తంగా మండలానికి ఇద్దరి చొప్పున కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, ఒక అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రూ. 2 వేల నుంచి రూ. 7 వేల వరకు మాత్రమే వేతనాలు అందు తున్నాయి. ఇదే కార్యాయాల్లో పనిచేసే ఏపీఎం, సీసీ, సీఏలను గుర్తించిన ప్రభుత్వం అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను విస్మరించడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మహిళా సాధికారత, గ్రామీణ స్థాయిలో పేదరిక నిర్మూలన మొదలైన కీలక పథకాల అమలు, రికార్డులు, పుస్తక నిర్వహణ, ఆడిటింగ్ వీరి బాధ్యతలు. 21 రకాల సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఎప్పటికప్పుడు అన్ని రకాల కంప్యూటర్ ఆధారిత రిపోర్టులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. వరి ధాన్యం కొనుగోలు లావా దేవీలను ఎప్పటికప్పుడు కంప్యూటర్ ఆపరేటర్లు నమోదు చేస్తే తప్ప పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంటున్నది. వీరు లేనిదే ఐకేపీ కార్యాలయాల్లో ఫైల్ కదలడం కష్టమే! ఇంత చేస్తున్నా తమ శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదనే ఆందోళనలో ఉన్నారు.

● సమ్మెబాట..

ఈ క్రమంలో సెర్ప్ సిబ్బంది నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 1న డీపీవోకు సమ్మె నోటీసు అందజేశారు. సమస్యలు సత్వరమే పరిష్కరించక పోతే ఆగస్టు 16 నుంచి సమ్మెలో పాల్గొంటామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించామనీ, స్పందన లేకపోవడంతో సమ్మె అనివార్యం అయిందని చెబుతున్నారు. సిబ్బంది సమ్మె చేపడితే మండల స్థాయిలోని స్త్రీనిధి, బ్యాంకు రుణాలు, విద్యార్థుల స్కాలర్‌షిప్స్, మండల సమాఖ్యల పుస్తకాల నిర్వాహణ, ఆడిట్ మీటింగ్‌ల నిర్వహణ ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ సేవలు నిలిచిపోనున్నాయి.

శ్రమను దోచుకుంటున్నారు

- బండి కిరణ్‌గౌడ్, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు



తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రభుత్వం అందరినీ గుర్తించింది. అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తల లాంటివారికి పెద్దమొత్తంలో జీతాలు పెంచారు. కాని పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేట్లు, అకౌంటెంట్లు, అటెండర్లను క్రమబద్ధీకరించడం లేదు. ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్నప్పటికీ కనీస వేతనం అందకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారింది. గత ప్రభుత్వం మా సేవలను గుర్తిస్తూ సర్క్యూలర్ (261-హెచ్‌ఆర్, సెర్ప్-2013) జారీ చేసింది. అప్పట్లో సీబీడీ, హెచ్‌ఆర్ కల్పిస్తూ నియామక పత్రాలు ఇచ్చారు. కానీ ఇంతవరకు అమలు చేయలేదు. ఉద్యోగ భద్రత కల్పించి కంప్యూటర్ ఆపరేటర్లకు రూ. 10,500, అటెండర్‌లకు రూ. 7 వేల జీతం ఇవ్వాలి. సమస్య సరిష్కారం కాకపోతే సమ్మెకు దిగుతాం. ఇప్పటికే సమ్మె నోటీసు అందజేశాం.

క్రమబద్ధీకరించాలి

- శోభారాణి, కంప్యూటర్ ఆపరేటర్, మంచిర్యాల



పుష్కర కాలంగా మండల సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్నా ఇంత వరకు మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించలేదు. చాలీచాలని జీతాలతో మా కుటుంబాలు దుర్బర జీవితం గడుపుతున్నాయి. అభయహస్తం పెన్షన్, స్కాలర్‌షిప్స్, హరితహారం, స్వచ్ఛభారత్ మిషన్ లాంటి ఎన్నో ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేస్తున్నాం. ఆపరేటర్లు చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలవుతాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చాక అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, వీవోఏలు ఇలా అందరికీ జీతాలు పెంచారు. కాని మమ్మల్ని మాత్రం విస్మరించారు.

ఆధ్యాత్మికం

దేవతల సంతృప్తి కోసమే యజ్ఞం

- దుద్దిళ్ళ నారాయణశర్మ, శ్రీ సత్యనారాయణస్వామి దేవాలయ వేదపండితులు, గూడెం

దండేపల్లి : అగ్ని ద్వారా ఆహుతులు సమర్పించుకోవడమే యజ్ఞం. దీనిని హవనం, యాగం, హోమమని కూడా పిలుస్తారు. దేవతలకు తృప్తి కలిగించడమే యజ్ఞం లక్ష్యం. సాధారణంగా యజ్ఞం అనేది అగ్ని వద్ద వేదమంత్రాల సహితంగా జరుగుతుంది. యజ్ఞాల్లో మంత్రాలు చదివేటప్పుడు చివరన స్వాహా అన్న పదాన్ని ఉచ్ఛరించడం వల్ల మనిషి చేసే పూజలు, ప్రార్థనలు, మంత్రాలు అన్నీ దేవుడికి చేరుతాయి. బ్రహ్మదేవుడు పెద్ద కుమారుడు అగ్ని అని విష్ణుపురాణం చెబుతోంది. అగ్ని దేవుడి భార్య స్వాహా. అగ్నికి దక్షిణంలో భార్య స్వదాదేవి, ఎడమ వైపున స్వాహాదేవి ఉంటుంది. దైవకార్యాల్లో ఆయనకు సమర్పించే ఆజ్యం, హవిస్సు, అన్నింటిని స్వాహాదేవి స్వీకరించి ఏ దైవం కోసం ఆ హోమం చేస్తున్నామో వారికి అందజేస్తుంది. బ్రహ్మదేవుడు పితృదేవతా గుణాలకు శ్రాద్ధకర్మలలో తర్పణ పూర్వకంగా సమర్పించే పదార్థాన్ని ఆహారంగా నియమించాడు. బ్రహ్మణులు తర్పణాలు ఇస్తున్నప్పటికీ పితృదేవతలకు సంతృప్తి కలగలేదు. పితృగణాలు బ్రహ్మను ప్రార్థించగా ఆయన ధాన్య నిమగ్నడై మానస పుత్రికను సృష్టించి ఆమెకు స్వదాదేవి అని పేరు పెట్టి పితృదేవతలకు పత్నిగా నియమించారు. ఆనాటి నుంచి పితృదేవతలు, మహర్షులు, విప్రులు, మానవులు స్వదాదేవిని పూజిస్తూ ఆమె అనుగ్రహంతో పితృదేవతలను సంతృప్తిపరుస్తూ వస్తున్నారు.



ఉద్యోగ వాయిస్
Employee Voice

సర్వీస్ నిబంధనలు రూపొందించాలి

- వై. వీరశంకర్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు



మంచిర్యాల టౌన్ : ఉపాధ్యాయులు ఏకీకృత సర్వీస్ నిబంధనలకు భారత రాష్ట్రపతి ఆమోదం పొందినందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక సర్వీస్ నిబంధనలు రూపొందించాలి. రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న డైట్, జూనియర్ లెక్చరర్, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ఉద్యోగోన్నతులను వెంటనే చేపట్టాలి. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించడం వల్ల పర్యవేక్షణ పోస్టుల భర్తీ జరిగి, విద్యావ్యవస్థలో సత్ఫలితాలు వస్తాయి. అలాగే ఉద్యోగోన్నతుల వల్ల ఖాళీ అయ్యే పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయవచ్చు. తద్వారా నిరుద్యోగులకు మేలు జరుగుతుంది. రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య చికిత్సలకు ఉద్యోగులకు అవకాశమివ్వాలి. ఆమేరకు ఆరోగ్యకార్డుల ద్వారా ప్రయోజనం కల్పించాలి. అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యోగులకు సహకరించాలి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలనే గురుకుల పాఠశాలలుగా మార్చాలి. ప్రతి ఉన్నత పాఠశాలకు పీఈటీ, హిందీ, తెలుగు పండిట్ పోస్టులను వెంటనే మంజూరు చేయాలి.

ప్రాణం తీసిన భూవివాదం

● యువకుడి దారుణ హత్యతో బెల్లంపల్లి మండలం చిన్నబూదలో కలకలం



దశరథం మృతదేహం



మృతుడి కుటుంబీకుల రాస్తారోకో

బెల్లంపల్లి టౌన్: బెల్లంపల్లి మండలంలోని చిన్నబూద గ్రామంలో ముద్దసాని దశరథం(38) అనే వ్యక్తి హత్యకు భూవివాదాలే కారణమని తెలుస్తున్నది. స్వయంగా అతని చిన్ననాన్న కొడుకు ముద్దసాని బాపు, అతని కొడుకు సంజీవ్ కలిసి గురువారం రాత్రి కత్తులు, గొడ్డళ్లతో హతమార్చడం స్థానికంగా కలకలం రేపింది. టీఆర్ఎస్ నియోజకవర్గ అధికారప్రతినిధి, మాజీ ఎంపీటీసీ కొమ్మెర లక్ష్మణ్ ప్రోద్బలంతోనే ఈ హత్య జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. బెల్లంపల్లి మండలంచంద్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 230లో 6.25 ఎకరాల భూమిని కొమ్మెరరాజయ్య నుంచి కొన్నేళ్ల క్రితం ముద్దసాని చిన్నయ్య కొనుగోలు చేశాడు. కానీ పట్టా చేయించుకోలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశమివ్వడంతో దశరథం, రాజయ్య కొడుకు కొమ్మెర లక్ష్మణ్‌ను ఆ శ్రయించాడు. ఇందుకు లక్ష్మణ్ ఒ ప్పుకోకపోవడం వివాదానికి దారితీసింది. లక్ష్మణ్‌పై ఒత్తిడి పెరగడంతో దశరథంపైకి ముద్దసాని బాపును ఎగదోసినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దశరథం అడ్డుతొలగిస్తే భూమిని పంచుకుందామని లక్ష్మణ్ చెప్పడం వల్లే బాపు, అతని కొడుకు సంజీవ్ ఈ హత్య చేశారని చెబుతున్నారు. హత్యకు కారణమైన బాపు, అతని కొడుకు సంజీవ్, తల్లి లక్ష్మితో పాటు హత్యకు ప్రోత్సహించిన లక్ష్మణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం ఉదయం బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేశారు. రెండు గంటల పాటు ఆందోళన కొనసాగింది. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తాండూర్ సీఐ జనార్దన్‌రెడ్డి, మందమర్రి సీఐ రాం చందర్‌రావు, బెల్లంపల్లి 1వ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పలువురు ఎస్సైలు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో చర్చించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేరుకొని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కానీ అప్పటికీ నిందితులను అరెస్ట్ చేయలేదనే కోపంతో బాపు ఇంటిపై దాడిచేశారు. సామగ్రిని ధ్వంసం చేసి, నిప్పంటించారు.

టీఆర్ఎస్ నేతను అరెస్ట్ చేయాలి

- గుండా మల్లేష్, మాజీ ఎమ్మెల్యే

దశరథంను హతమార్చినవారిని, అందుకు కారణమైన టీఆర్ఎస్ నేత లక్ష్మణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ డిమాండ్ చేశారు. కుటుంబసభ్యులు రాస్తారోకో చేపట్టగా, వారికి మద్దతు పలికారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూదందాలు, హత్యలు పెరిగిపోయాయని, సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందని అభిప్రాయపడ్డారు. భూవివాదం వల్లే దశరథం హత్య జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం చేసేదాకా సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ ఉన్నారు.

అనారోగ్యంతో కార్మిక నాయకుడి మృతి



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్

కాసిపేట : మండలంలోని సోమగూడెంకు చెందిన ఏఐటీయూసీ సీనియర్ కార్మిక సంఘం నాయకులు బైరగోని వెంకటి (75) అనారోగ్యంతో మృతి చెందాడు. కొంత కాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న వెంకటి శుక్రవారం ఉదయం ఇంట్లో మృతి చెందారు. ఈయన కార్మికుల పక్షాన పోరాడి ఎన్నో హక్కులు సాధించి పెట్టారు. సోమగూడెంలోని కొమురయ్య భవన్ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. వెంకటి మృతి కార్మిక లోకానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన వెంట సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు మల్లేష్, మండల కార్యదర్శి లక్ష్మణ్, జాడి పోశం ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

భీమిని : మండల కేంద్రంలో శుక్రవారం రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాలకు చెందిన ఎస్. కే మధర్, నల్లగొండ వెంకటేష్ 10 క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో అక్రమంగా కాగజ్‌నగర్ వైపునకు తరలిస్తుండగా సమాచారం మేరకు ఎస్సై కట్యూరి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఆటోతో పాటూ ఇద్దరిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం బియ్యాన్ని తహసీల్దార్ అప్పగించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మంచిర్యాల పట్టణంలో ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో నిలిపి ఉంచిన వ్యానును వేగంగా దూసుకు వచ్చిన ఇసుక లారీ ఢీకొట్టడంతో వ్యాన్ డ్రైవర్ అక్కడి కక్కడే మృత్యువాత పడ్డాడు.

మంచిర్యాల క్రైం : మంచిర్యాల పట్టణం బెల్లంపల్లి చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పెగడపెల్లికి చెందిన పెరుమల్ల భూమేష్(35)మృతి చెందినట్లు ఎస్సై ఆకుల అశోక్ తెలిపారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన భూమేష్ గోపాల్‌వాడలో ఉంటున్న అక్క నీరటి పద్మ కూతురు శిరీష అనారోగ్యంతో ఉండడంతో ఆమెను చూసేందుకు వచ్చాడు. బెల్లంపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా బస్టాండ్ నుంచి ఐబీ చౌరస్తా వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో భూమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కళ, కుమారుడు వంశీ, కూతురు ప్రియాంక ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





భూమేష్ మృతదేహం, మృతుడు రియాజ్(ఫైల్)

● నిలిపి ఉంచిన వ్యాన్‌ను..

సుల్తానాబాద్/లక్షెట్టిపేట: నిలిపి ఉంచిన వ్యానును వేగంగా దూసుకు వచ్చిన ఇసుక లారీ వెనుకనుంచి ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతిచెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని దుబ్బపల్లి వద్ద ఆగి ఉన్న కోళ్ల వ్యా నును గురువారం అర్ధరాత్రి ఇసుక లోడ్‌తో కరీంనగర్ వైపు వెళుతున్న లారీ (ఏపీ07 యూఏ1188) వెనుక వైపు నుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో కోళ్ల వ్యాను డ్రైవర్ ఎస్‌కె రియాజ్ (43)మృతి చెందాడు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట నుంచి సుల్తానాబాద్ మండలంలోని దుబ్బపల్లి శివారులోని ఓ కోళ్లఫారం వద్దకు ఎస్‌కె రియాజ్ వచ్చి వ్యాన్‌ను నిలుపుకున్నాడు. ఇసుక లారీ అతి వేగంతో వచ్చి కోళ్ల వ్యానును వెనుకనుంచి ఢీ కొట్టడంతో స్టీరింగ్‌పై కూర్చున్న డ్రైవర్ ఎస్‌కె రియాజ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రహేనాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు ఇసుక లారీ డ్రైవర్ నాగర్‌కర్నూల్‌కు చెందిన కొండూరి నగేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సార్వత్రిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కోటపల్లి : ఈ నెల 20న నిర్వహించే వయోజన విద్య సార్వత్రిక పరీక్షలను సాక్షర భారత్ కోఆర్డినేటర్‌లు పకడ్బందీగా నిర్వహించాలని సాక్షర భారత్ జిల్లా ఇన్‌చార్జి పురుషోత్తం నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కోటపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సాక్షర భారత్ గ్రామ సమన్వయకర్తలతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలకు హాజరయ్యే అక్షరాస్యుల వివరాలతో పాటు ఆధార్‌నంబర్, వ్యక్తిగత వివరాలను రెండు రోజుల్లో సేకరించి జిల్లా కార్యాలయంలో అందించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎంఏ అలీం, జిల్లా రిసోర్స్ పర్సన్ రెడ్డి మల్ల ప్రకాషం, మండల సమన్వయ కర్త శ్యాంసుందర్ పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని చుక్కల జింక హతం

కోటపల్లి : మండలంలోని రాజారాం అటవీ ప్రాంతంలో శుక్రవారం వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకొని చుక్కల జింక హతమైంది. అటవీ ప్రాంతంలోని నీటి వనరులు ఉన్న చోట వేటగాళ్లు అల్యూమినియం తీగలతో ఉరులు ఏర్పాటు చేశారు. కాగా తాగు నీటికై వచ్చిన చుక్కల జింక వేటగాళ్లు అమర్చిన ఉరిలో పడి మృతి చెందింది. అయితే అటవీ ప్రాంతంలో జింక మృతి చెందిందనే సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన ప్రాంతానికి వెళ్లి అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారు. వేటగాళ్లు అమర్చిన ఉరిలో మృతి చెందినట్లు జింక గొంతుచుట్టూ ఆనవాళ్లు ఉన్నాయి. కాగా విషయం బయటకు పొక్కనియ్యకుండా పశువైద్యాధికారితో పోస్టుమార్టం చేయించి ప్రమాదంలో జింక మృతిచెందినట్లు చెబుతూ దానిని ఖననం చేశారు. గత ఏప్రిల్ నెలలో వేటగాళ్ల వలలో పెద్ద పులి మృతి చెందగా అప్పటి నుంచి వేటను కట్టడి చేశావని చెప్పిన అటవీ అధికారులు జింక మృతిపై నోరు మెదపకపోవడం గమనార్హం, వేటగాళ్ల వలలో జింక మృతిచెందినట్లు బయటపడితే ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురవుతామనే ఉద్దేశంతోనే ఈ ఘటనను రహస్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.



మృతి చెందిన చుక్కల జింక

పోటీ పరీక్షలపై రేపు అవగాహన సదస్సు

మంచిర్యాల టౌన్: సివిల్ సర్వీసెస్, ఇతర పోటీ పరీక్షలపై ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ, ఆదిలాబాద్ అడ్వకేట్ రోశిరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11గంటలకు సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో సివిల్ సర్వీసెస్ ఉద్యోగులైన ఐఏఎస్, ఐపీఎస్, పరీక్షలపై పూర్తి అవగాహన కల్పించనున్నట్లు తెలపారు. సదస్సుకు కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని రాస్తారోకో

మంచిర్యాల టౌన్: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాలలో రాస్తారోకో చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు మురళికృష్ణ, సుందిల్ల మల్లేష్, సతీష్, జగదీష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

లక్సెట్టి పేట: లక్సెట్టిపేట తహసీల్దార్ కార్యాలయలం ఎదుట చేపట్టిన ఎంఆర్‌పీఎస్ దీక్ష శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు మద్దతుగా గుల్లకోట గ్రామానికి చెందిన మేము సైతం యూత్ సభ్యులు, గ్రామంలోని కులస్థులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చొప్ప దండి రమేశ్, జిల్లా నాయకులు చుంచు రమేశ్, రాములు, చాత రాజు రాజన్న, యూత్ అధ్యక్షులు సుజిత్, సభ్యులు తిరపతి, రాజు, శంకరయ్య, ప్రసాద్, సంతోష్, మురళిలు పాల్గొన్నారు.

మంచిర్యాల రూరల్: హాజీపూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు చాతరాజు మురళిధర్, బండపెల్లి రాజన్న మాదిగ, సీపెల్లి మొగిలి, సీపెల్లి పోశం పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి నిరసన

దండేపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం దండేపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు ఒంటి కాలుపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల కన్వీనర్ నగారపు సత్తయ్య, కో కన్వీనర్ కొండయ్య, నాయకులు బుచ్చయ్య, కమలాకర్, రమేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో వృక్ష-రక్షా బంధన్

మంచిర్యాల టౌన్: గ్రీన్ కోర్ మంచిర్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వృక్ష-రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్థానిక రాముని చెరువు కట్టపై ఉన్న చెట్లకు రాఖీలు కట్టి రక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం సేవ్ ట్రీస్ నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ గుండేటి యోగేశ్వర్, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్‌గని, ప్రధానోపాధ్యాయుడు వేణు గోపాల్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా మనోహర్‌రావు

జన్నారం: యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యధర్శిగా మనోహర్‌రావును శుక్రవారం నియమించినట్లు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు.

ఏఐఎస్‌ఎఫ్ యాత్రకు ఘనస్వాగతం..

లక్సెట్టి పేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా కేజీ టూ పీజీ ఉచితవిద్యను అందించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆద్వర్యంలో దేశవ్యాప్తంగా చేస్తున్న యాత్రకు శుక్రవారం లక్సెట్టిపేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. యాత్రను చేపడుతున్న ఆల్‌ఇండియా ప్రెసిడెంట్ అలీవుల్లా ఖాధ్రి, ప్రధాన కార్యదర్శి తిరుమలయ్య, రాష్ట్ర అధ్యక్షులు రాములుయాదవ్‌లు మాట్లాడుతూ దేశంలో ఎందరో నిరుపేద కుటుంబాలు కార్పోరేట్ రంగం విద్యను అభ్యసించలేక చదువులు మానేస్తూన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మేదరి దేవవరం, రవికిరణ్, రాములు, మల్లేశ్, శేఖర్‌లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మంచిర్యాల క్రైం: మంచిర్యాల మున్సిపాలిటీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఎమ్మెల్యే దివాకర్ రావుకు తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు జైపాల్‌సింగ్, గోపాల్, రాజన్న, రామక్క, రాజమల్లు, పోసవ్వ, తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుల అరెస్ట్

జన్నారం: సిరిసిల్లకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులను శుక్రవారం ఎస్సై రమేష్‌గౌడ్ మండల టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందన్నారు.

కనీసం సిరిసిల్లలో ఆత్మహత్యలకు పాల్పడ్డ కుటుంబాలకు పరామర్శించేందుకు వెళ్తున్న వారిని సైతం అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

మంచిర్యాల క్రైం: మంచిర్యాల పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో శుక్రవారం మహిళలు వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముత్తైదువులకు పసుపు కుంకుమలుతో వాయినాన్ని అందించారు. పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక వ్రతాలను ఆచరించారు. రామాలయంలో, హనుమాన్ దేవాలయంలో, పాత మంచిర్యాల శివాలయ, రామాలయంలో భక్తుల రద్దీ నెలకొంది.


శ్రీరాంపూర్‌లో మహిళల వ్రతాలు


నస్పూర్ మండలం రాంనగర్‌లో వరలక్ష్మీ వ్రతాలు

● శ్రీరాంపూర్‌లో..

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని కృష్ణకాలనీ శివాలయ ప్రాంగణంలోని శ్రీ గీతా ప్రశాంతి నిలయంలో శ్రీ మద్భగవద్గీత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, 3వ ద్వాదశి గీతా హవన యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7గంటల నుంచి శ్రీకృష్ణ పరమాత్మ అభిషేకం, పూజ, 3వ ద్వాదశి గీతా హవన యజ్ఞం కార్యక్రమాలను పలువురు దంపతులు నిర్వహించారు. అనంతరం భగవద్గీతలోని 13వ అధ్యాయం నుంచి 18వ అధ్యాయం వరకు పారాయణం జరిపారు. 45మంది స్త్రీమూర్తులచే వరలక్ష్మి వత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్సంగం అధ్యక్షుడు గురూజీ దాసరి రాజేశం, రఘోత్తమశర్మ, ఆధ్యాత్మికవేత్త జేపీ.విఠల్, గీతా సత్సంగ్ ప్రతినిధులు ప్రసాద్, స్వర్ణకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● నస్పూర్ మండలంలో..

నస్పూర్: నస్పూర్ మండలం తీగల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్ ప్రాంతంలో ఉన్న ఆదిపరాశక్తి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. దాదాపు 250 మంది భక్తులు వ్రతంలో పాల్గొని వరలక్ష్మిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సీసీసీ కార్నర్ రాంనగర్‌లో గల అదిపరాశక్తి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆదిపరాశక్తిని దర్శించుకున్నారు. అమ్మ వారి ఆలయం ఎదుట భక్తులు దీపాలను పెట్టి చల్లంగా చూడమని కోరుకున్నారు. శ్రావణ మాస శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● లక్షెట్టిపేట మండలంలో..

లక్సెట్టి పేట: లక్సెట్టిపేట పట్టణంలోని సరస్వతిశిశు మందిరంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాలను వేద బ్రాహ్మణులైన కొత్తపల్లి భరద్వాజశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పూజలలో 50మంది ముత్తెయిదువలు పాల్గొని వ్రతాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మినుముల సుమతీశాంతికుమార్, పాఠశాల నిర్వహక కమిటీ సభ్యులు కొత్త వెంకటేశ్వర్లు, చింత అశోక్, రమేశ్‌చంద్‌జైన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'తల్లి పాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది'


దండేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల

దండేపల్లి: తల్లి పాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని దండేపల్లి ఎంపీపీ గోళ్ల మంజుల, ఐసిడిఎస్ సిపిడివో లక్ష్మికళావతి పేర్కొన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని వారు సూచించారు. తల్లిపాల వారోత్సవలో భాగంగా దండేపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల విశిష్టత గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిముర్రుపాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన చంటి పిల్లలకు గంటలోపు ప్రతి తల్లి మురుపాలు బిడ్డకు తాగించలన్నారు. గర్భిణి, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేందర్, తెలంగాణ పర్యావరణ పరిరక్షణ సమితి జిల్లా ఆధ్యక్షులు గోళ్ల రాజమల్లు, పాఠశాల హెచ్‌ఎం అక్కల మల్లేషం, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు ప్రసన్నకుమారి, జయప్రద, అంగన్‌వాడి కార్యకర్తలు అనసూర్య, కళావతి, సూజాత, సుమిత, వివిధ గ్రామాల అంగన్‌వాడి కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

రక్షాబంధన్ వేడుకలు..

లక్సెట్టి పేట: లక్సెట్టిపేట పట్టణంలోని మోదెల రోడ్డులో గల బ్రహ్మకుమారి రాజయోగా సేవా కేంద్రంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ యోగా కేంద్రంలో నిత్యం శిక్షణ పొందుతున్న వారికి బ్రహ్మకుమారీలు రాఖీలను కట్టారు.

ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఇంచార్జ్ రమాదేవి, లక్సెట్టిపేట ఇంచార్జ్ పద్మ, నిర్వాహకులు ఆది సతీష్, సుధాకర్, బీజేపి మండల అధ్యక్షులు బొప్పుసతీష్, మోదెల సర్పంచ్ లచ్చన్నలు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట సీఐగా ప్రతాప్

లక్సెట్టి పేట: లక్సెట్టిపేట నూతన సీఐగా డి. ప్రతాప్ శుక్రవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు సీఐగా విదులు నిర్వహించిన మోహన్ ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ కాగా అతడి స్థానంలో ప్రతాప్ బాధ్యతలు తీసుకున్నాడు.

10 లోపు మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాన్ని సాధిస్తాం

● మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మంచిర్యాల టౌన్: స్వచ్ఛభారత్‌లో భాగంగా మంచిర్యాల మున్సిపాలిటీలో ఈనెల 10లోపు మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాన్ని సాధించనున్నట్లు కమిషనర్ చింత శ్రీకాంత్ తెలిపారు. కార్యాలయ ఆవరణలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద శాతం నిర్మాణాలను పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 3316 మరుగుదొడ్ల నిర్మాణాలను ఎంపిక చేయగా ఇప్పటి వరకు 3104 నిర్మించినట్లు తెలిపారు. ఇంకా 208 నిర్మాణాలు పెండింగ్‌లో ఉండగా అందులో 167 వరకు సగానికి పైగా నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 2,6,11 వార్డుల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి ప్రత్యేక గ్రాంట్ కింద రూ.10 కోట్లు వస్తాయన్నారు. ఈనిధులతో మున్సిపాలిటీని మరింతగా అభివృద్ధి చేసే అవకాశం లభిస్తుందన్నారు. ప్రజలు కూడా నిర్దేశిత గడువులోపు మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.

పరిశీలనకు ఇద్దరు ప్రత్యేక అధికారులు..

కాగా మున్సిపాలిటీ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణాలను లక్ష్యంలోపు పూర్తి చేసేందుకు గాను ప్రభుత్వం ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించింది. మెప్మా మిషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ రమాదేవి, ఉస్మాబాద్ కమిషనర్ కుమారస్వామి మంచిర్యాలలో పరిశీలనకు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసుకునేందుకు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినట్లు తెలిపారు.

పట్టణంలోని రెండో వార్డులో నిర్మాణాలను శుక్రవారం పరిశీలించినట్లు ఆయన తెలిపారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేసి స్వచ్ఛ మంచిర్యాలగా డిక్లేర్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ సాంబయ్య, ఏఈ నర్సింహస్వామి, మెప్మా పీఆర్‌పీ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై పునరాలోచన చేయాలి

నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ మీర్ అమీర్‌కు వ్యాపారుల వినతి

మందమర్రి : మందమర్రి పట్టణంలోని రాష్ట్రీయ రహదారి రోడ్డు విస్తరణ పనులపై పునరాలోచన చేయాలని నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ మీర్ అమీర్ అలీకి ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలుకు విన్నవించారు. గురువారం మందమర్రి రాష్ట్రీయ రహదారి రోడ్డు విస్తరన పరిశీలన నిమిత్తం వచ్చిన అధికారికి వ్యాపారస్తులతో కలిసి విప్ పరిస్థితిని వివరించారు. పాత బస్టాండ్ ఏరియాలో 120 మీటర్ల వెడల్పుతో రెండు వైపు లా దుకాణ సముదాయాలతో పాటు భవనాలు నేల మట్టం కానున్నాయని, కొంత వెడల్పును తగ్గిస్తే ఎవరికీ నష్టం ఉండదని తెలిపారు. ఎప్పటి నుంచో వ్యా పారస్థులు ఈ రోడ్డు వెడల్పుపై ఆందోళన చెందుతున్నారని, గతంలో రోడ్డు వెడల్పు మూలంగా నష్టపోయారని కూడా ఆయన పేర్కొన్నారు. బురుదగూడెం నుంచి మేడారం స్టేజ్ వరకు మున్సిపాలిటీ పరిధిలో 150 మీటర్ల రోడ్డు


నేషనల్ హైవే పీడీకి వినతిపత్రం సమర్పిస్తున్న వ్యాపారులు

వెడల్పు చేపట్టడం వల్ల కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని, దీనిపై కూడా మరోసారి ఆలోచించాలని కోరారు. కాగా వ్యాపారస్థులు ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాపార కమిటీ నాయకులు పోశం, పెట్రోల్ బంక్ రమేష్‌లు మాట్లాడుతూ రోడ్డు వెడల్పు వల్ల తమ బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గతంలో రో డ్డు విస్తరణ వల్ల తమ గృహాలు, దుకాణాలు తొలగించుకున్నామని, తిరిగి మరోసారి రోడ్డు వెడల్పు చేపడితే తా ము జీవించే పరిస్థితులు ఉండవని తెలిపారు. తమకు రోడ్డు వెడల్పు వల్ల తలెత్తే సమస్యలను తమరే ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. అనంతరం టేపు ద్వారా రోడ్డును కొలతలను చూపించి ఎక్కడి వరకు గృహాలు పోతాయో కూడా అధికారికి చూపించారు. ఈ విషయాన్ని తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ప్రాజెక్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపార కమిటి నాయకులు, టీఆర్ఎస్ నాయకులు ఎస్ ప్రభాకర్, జే రవిందర్, కే తిరుపతిరెడ్డి, రమేష్, ఉప్పుల కృష్ణ, ముకేష్ ఉపాధ్యాయ, ఎర్ర రాజు, బోరిగం వెంకటేష్, జైన శ్రీధర్, నరేష్, రాజమౌళి, శ్రీనాత్ తదితరులు పాల్గొన్నారు.

'హెల్మెట్‌తోనే ప్రాణాలకు రక్షణ'

తాండూర్ : ద్విచక్ర వాహనదారులు హె ల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయాల్లో ప్రాణాలను రక్షించుకోవచ్చని తాండూర్ ఎస్సై కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ జాగృతి విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో చెల్లెకు అన్న రక్ష.. అన్నకు హెల్మెట్ రక్ష గోడప్రతులను ఎస్సై రవి, టిజెఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ ఇడిదినేని గణేష్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కొత్తపల్లి రవి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది తలకు తీవ్ర గాయాలు కావడం వల్లే చనిపోతున్నారన్నారు. అందుకే ప్రతిఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రతి సోదరీ సోదరులకు హెల్మెట్ బహుమతిగా ఇచ్చి వాటిని ధరించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ఎఫ్ నాయకులు మహేష్, సాయి, రఘు, మహేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

చెన్నూర్‌లో మండలంలో......

చెన్నూర్ : శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పట్టణ, మండల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శివాలయం, జగన్నాథస్వామి ఆలయం, షిర్డిసాయిబాబా, అయ్యప్ప, పంచముఖ హనుమాన్, ప్రతాప మారుతీ హనుమాన్, సుద్దాల శ్రీ సీతారామచంద్ర స్వామి, కిష్టంపేట వీరాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్, ఆర్యవైశ్య భవనాల్లో వరలక్ష్మీ వ్రతం, వరలక్ష్మీ పారాయణం, సామూహిక కుంకుమార్చనను కన్నుల పండువగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం మహిళలు, పట్టణ మహిళలు పాల్గొన్నారు.

భీమారం మండలంలో...

భీమారం : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వ్రతం అనంతరం ఇరుగు పొరుగు మహిళలను పిలిచి పుష్పాలు, పసుపు, కుంకుమలు, వాయినాలు ఇచ్చి అత్యంత ఘనంగా జరుపుకున్నారు.

మందమర్రి పట్టణంలో...

మందమర్రి : పట్టణంలోని మారుతి నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రత నోములను


మందమర్రిలో నోములు నోచుకుంటున్న మహిళలు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళలు నోములు నోచుకున్నారు. ఈ నోములకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలి వచ్చి భక్తి శ్రద్ధలతో నోముకున్నారు.

మందమర్రి మండలంలో...

మందమర్రి రూరల్ : మండలంలోని సారంగపల్లి, పొన్నారం, చిర్రకుంట, వెంకటాపూర్, అందుగుల పేట గ్రామాల్లో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం చేశారు. కేకే-1 సీఎస్‌పీ ఆవరనంలోని దుర్గభవాణి ఆలయంలో పూజారి నర్సింగ్ భవాని ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.

షెపర్డ్ స్కీం 9 గొర్రెలు మృతి

జైపూర్ : మండలంలోని రామారావుపేట గ్రామం గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం మంజూరు చేసిన తొమ్మిది గొర్రెలు శుక్రవారం మృతి చెందాయి. రామారావుపేట గ్రామానికి 108యూనిట్ల గొర్రెలను ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి విడుత 54 యూనిట్లకు గొర్రెలు పంపిణీ చేసేందుకు రెండు దఫాలుగా మహారాష్ట్ర నుంచి తెప్పించారు. వారం రోజుల క్రితం ఏడు గొర్రెలు, శుక్రవారం మరో తొమ్మిది గొర్రెలు మృతి చెందాయి. ఈ విషయమై గొర్రెల పెంపకందారుల సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు భీరయ్యను వివరణ కోరగా, ప్రస్తుతం గొర్రెలకు ఎలాంటి జబ్బులు సోకలేదన్నారు. మహారాష్ట్ర నుంచి గొర్రెల రవాణా లారీలో ఇరుకుగా ఉండటం, ప్రయాణంలో గొర్రెలకు గాయాలై చనిపోయినట్లు తెలిపారు.

గొర్రెలు పరిశీలించిన డీఆర్డీవో

కోటపల్లి : మండలంలోని వెంచపల్లిలో శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి వెంకటి ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన గొర్రెలను పరిశీలించారు. వాటర్‌షెడ్‌కు సంబంధించి ఐడబ్ల్యుఎంపీ పనుల పరిశీ లనకు వెళ్లిన డీఆర్‌డీవోకు మార్గమధ్యలో గొర్రెలు కనబడటంతో వాటిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గొర్రెలు ఎలా ఉన్నాయని, వాతావరణ మార్పుల్లో మేత మేస్తున్నాయా అని ప్రశ్నించారు. వ్యాధులు సోకక ముందే టీకాలు వేపించాలని, గొర్రెలను జాగ్రత్తగా చూసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం పిన్నారం,షెట్‌పల్లి గ్రామాల్లో ఐడబ్ల్యుఎంపీ కుంటల నిర్మాణ పనులను, జనగామలో హరితహారం కింద నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వర్‌తో పాటుతో సిబ్బంది పాల్గొన్నారు.

దిగులు పడొద్దు....

కాసిపేట : గొర్రెలు మృత్యువాతకు పడుతున్నాయని యజమానులు ఆందోళన చెందవద్దని ప్రత్యేక అధికారి మడావి గంగారం అన్నారు. మండలంలో పర్యటించి సబ్సిడీ గొర్రెలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ యజమానులతో మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన గొర్రెలు మన వాతావరణానికి అలవాటు పడేంత వరకు కొంత సమయం పడుతుందన్నారు. గొర్రెలు మృతిచెందిన బాధితులకు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు, ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. గొర్రెలకు మెరుగైన వైద్య సేవలు అం


కోటపల్లిలో గొర్రెలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో వెంకటి

దించేందుకు పశువైద్యాధికారులను అప్రమత్తం చేసి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతరం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ అంగన్ వాడీ కేంద్రంలోనూ సరైన విద్యా ర్థులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. బడీడు పిల్లలందరూ అంగన్‌వాడీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని సూచించారు. ఈయన వెంట ఏపీవో రవీందర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చేతి పంపు ప్రారంభిస్తున్న విప్ ఓదెలు

చేతి పంపును ప్రారంభించిన విప్

మందమర్రి రూరల్ : పట్టణంలోని మార్కెట్ ఏరియాలో శుక్రవారం ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు చేతి పంపును ప్రారం భించారు. ఎమ్మెల్యే నిధులతో ఈ చేతిపంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల, వ్యాపారస్తుల అవసరాల కోసం చేతిపంపును ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందని పేర్కొన్నారు. వ్యాపారస్తులు, కార్మికులు నీటి కోసం ఇబ్బంది పడకూడదని, ఈ చేతి పంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు ఎస్ ప్రభాకర్, మేడిపల్లి మల్లేష్, వ్యాపార సంఘం నాయకులు గంప ఆంజనేయులు, దుర్గయ్య, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి దేవాలయ జీర్ణోద్ధణ పనులకు రూ.21లక్షలు మంజూరు

జైపూర్ : మండలంలోని టేకుమట్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయ జీర్ణోద్ధరణ పనులకు దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.21లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరు ఉత్తర్వులను ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు శుక్రవారం దేవాలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, ఎంపీటీసీ నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా విప్ ఓదెలు మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా దేవాలయ నిర్మాణం పూర్తిస్థాయిలో నోచుకోకుండా ఉండిపోయిందన్నారు. దేవాదాయశాఖ మంత్రిని గ్రామానికి తీసుకవచ్చి చూపించి ప్రత్యేక శ్రద్ధతో చెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు నిధులు మంజూరు చేయించామన్నారు. అనంతరం విప్‌కు, దేవాదాయశాఖ మంత్రికి గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు తీర్చాలని కేటీఆర్‌కు వినతి

భీమారం : భీమారం గ్రామంలో సమస్యలు తీర్చాలని చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, భీమారం, జైపూర్ మండలాల ఇంచార్జీ చేకుర్తి సత్యనారాయణరెడ్డిలు కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో ఏ ప్రభుత్వ కార్యాలయానికి సొంత భవనాలు లేవని, వాటి నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. మండల కేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం జూనియర్ కాలేజీ నిర్మించాలని, బస్టాండ్ చెరువు ప్రాంతంలో మినీ ట్యాంక్ బండ్‌ను ఏర్పాటుచేయాలన్నారు. మండలంలో వైద్య సదుపాయాల మెరుగుకు ఆసుపత్రి నిర్మాణానికి మంత్రితో విన్నవించినట్లు చేకుర్తి సత్యనారాయణరెడ్డి తెలిపారు.

పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శిగా రాజమౌళి


రాజమౌళి

జైపూర్ : ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా జైపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన బుద్దాపురం రాజమౌళిని నియమిస్తూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని ముదిగుంట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, వేలాల యూపీఎస్ ఉపాధ్యాయుడు లగిసెట్టి సత్యనారాయణను జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను జిల్లా బాధ్యులుగా ప్రకటించినందుకు జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డికి జైపూర్ మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు రాంనారాయణ, కార్యదర్శి వెంకటస్వామిలు కృతజ్ఞతలు తెలిపారు.

'పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం వద్దు'

కోటపల్లి : పారిశుధ్య పనుల నిర్వహణలో పంచాయతీల కార్యదర్శులు, గ్రామాల సర్పంచ్‌లును అలసత్వం ప్రదర్శించరాదని డీఆర్‌డీవో వెంకటి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని సిరుసా గ్రామంలో అస్థవ్యస్థంగా మారిన పారిశుధ్యం, పరిసరాల్లో నీటి నిల్వ గుంత పరిశీలించి పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి.

విలేకరుల ఫోన్ నంబర్లు

బెల్లంపల్లి	9985402901	కాసిపేట	9550355123
బెల్లంపల్లి టౌన్	9949253601	కన్నెపల్లి	9951914139
బెల్లంపల్లి రూరల్	8106018543	నెన్నెల	9908152456
తాండూర్	8125895922	వేమనపల్లి	9603485580
భీమిని	9441139527		



మొక్కలను పరిశీలిస్తున్న కవ్వాల్ టైగర్‌జోన్ కన్జర్‌వేటర్ శరవానన్

'అడవులతోనే మానవ మనుగడ'

కాసిపేట : అడవులతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని కవ్వాల టైగర్‌జోన్ కన్జర్‌వేటర్ శరవానన్ అన్నారు. శుక్ర వారం మండలంలోని రెట్టిపెల్లి, లక్ష్మీపూర్, సోనాపూర్‌లలో ప ర్యటించి హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నాటిన మొక్కలే రేపి వృ క్షాలు అవుతాయన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. చెట్లను నరికివేస్తే వాతావరణ సమతుల్యత దెబ్బతిని ప్రజలపై తీవ్ర ప్రభావం చూపెడు తుందన్నారు. వర్షాలు పడకపోవడం కాకుండా మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడంలో అందరూ బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక కూలీలను నియమించాలన్నారు. అడవుల అడవుల అభివృద్ధికి కృషి చేసి సామాజిక అడవులను పెంపొందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయన వెంట డీఎఫ్‌వో ప్రభాకర్, ఎఫ్‌డీవో తిరుమల్‌రావు, ఎఫ్‌ఆర్‌ఓ వినయ్‌కుమార్ సాహు, సెక్షన్ అధికారి హైమద్‌అలీ, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు ఉన్నారు.

వీవోఏల వేతనాల పెంపుపై హర్షం

నెన్నెల : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వేవోఏ)లకు జీతం పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై సెర్ఫ్ ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పంజాల ప్రకాష్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. నెన్నెల మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇక మీదట వీవోఏలకు నెలకు రూ. 3 వేల గౌరవ వేతనం లభిస్తుందన్నారు. జిల్లాలోని 510 మంది వీఏవోలకు లబ్ధి చేకూరుతుందన్నారు. గ్రామాల్లో మహిళా చైతన్యంతో పాటు సామాజిక రుగ్మతలు రూపమాపడంలో, అ క్షరాస్యత పెంచడంలో వీవోఏలు విశేష కృషిచేస్తున్నారని కొని యాడారు. ఇప్పటి వరకు క్రియాశీల పాత్ర పోశించిన వీవోఏలు జీతాల పెంపుతో మరింత భాద్యతగా పని చేయాలని ప్రకాష్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆవునూరి లచ్చన్న, జిల్లా నాయకులు మంతెన ఆంజనేయులు, రామకృష్ణ, శ్రీనివాస్, బొమ్మెన సత్యనారాయణగౌడ్, యశోద, చారి తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణతో నేతకాని కులస్థులకు నష్టం'

తాండూర్ : ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీ నేతకాని కులస్థులు తీవ్రంగా నష్టపోతారని తెలంగాణ నేతకాని ఇన్కర్ మహర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కలాలి నర్సయ్య, జిల్లా నాయకుడు గొమాస రాజంలు అన్నారు. వర్గీకరణ చేపట్టొద్దని శుక్రవారం టీఎన్ ఎంఐఎస్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ రామచంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య, రాజంలు మాట్లాడుతూ గతంలో ఎస్సీల వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు వర్గీకరణకు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ కొన్ని రాజకీయ పార్టీలు, సామాజిక వర్గాలు కుట్రపన్ని ఎస్సీ వర్గీకరణ విషయాన్ని తెరపైకి తీసుకొచ్చాయన్నారు. వర్గీకరణ తో ఎస్సీ నేతకాని కులస్తులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వర్గీకరణ బిల్లును ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టొద్దని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఐఎంఎస్ అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దాగం పాపయ్య, ప్రచారకార్యదర్శి పాగిడి చిరంజీవి, నాయకులు దుగుట శ్రీనివాస్, గంగారం, చందు, సత్తయ్య, జయరాం, మల్లయ్య, రమేష్, కృష్ణ, ఆనందరావు, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



బెల్లంపల్లిలో వరలక్ష్మీ వ్రతం పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతారాణి, పూజలు చేస్తున్న మహిళలు

బెల్లంపల్లి టౌన్ : సామూహిక వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పట్టణంలోని శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో సామూహిక వరలక్ష్మి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలలో మహిళలు పాల్గొనగా మున్సిపల్ చైర్‌పర్సన్ పసుల సునితారాణి, మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూదరి సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి కన్వీనర్ కంభం పాటి నేహ, రెండో వార్డు కౌన్సిలర్ ఆరెపల్లి సుధారాణి, తదితరులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాండూర్ మండలంలో...

తాండూర్ : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ఆలయాల్లో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయమే ముత్తైదువులందరూ ఇంటిని అలంకరించి లక్ష్మిదేవిని పూజించారు.

వరలక్ష్మి వ్రతానికి సంబంధించిన కథను చదివి పూజకు వచ్చిన మహిళలకు వాయినాలు, తాంబూలాలు ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. కుటుంబ సభ్యులు ఐశ్వర్యం, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు దేవతలను కోరుకున్నారు.



తాండూర్ ఆలయంలో వ్రతాలు చేస్తున్న మహిళలు

కొనసాగుతున్న ఎంఆర్‌పీఎస్ దీక్షలు

బెల్లంపల్లి టౌన్ : ఎస్సీల వర్గీకరణ బిల్లు పార్ల మెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి పదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షుడు నక్క రాజేష్, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు నక్క కృష్ణ, ఐలయ్యలు మాట్లాడుతూ పది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం సిగ్గుచేట న్నారు. ఈ దీక్షల్లో ఎంఆర్‌పీఎస్ నాయకులు రాములు, కన్నెపల్లి పోశం, శ్రీను, మధునయ్య, మహేందర్, సందీప్, సాయి, ప్రతాప్, రాజశేఖర్, రాజేష్, నక్క నికిల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'

తాండూర్ : ఎస్సీ వర్గీకరణ చేపట్టి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ తాండూర్ మండల ఇన్‌ఛార్జి కొండ్ర తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే రాబోయే ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్సీలు, ఉప కులాల వారు ఓట్ల రూపంలో తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ దీక్షల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, శంకర్, వెంకటేష్, లింగయ్య, గణేష్, నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిలో దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న విప్ ఓదెలు



నెన్నెలలో దీక్షలకు మద్దతు ప్రకటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల మద్దతు

నెన్నెల : ఎస్సీల వర్గీకరణ కోరుతూ ఎమ్మారీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. నెన్నెల తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు ఈ కార్యక్రమంలో టీపీసీ కార్యదర్శి మత్తమారి సూరిబాబు, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ చిలుముల శంకర్, జిల్లా నా యకులు జయరాం, ఎండీ అబ్బల్, కంకట శ్రీనివాస్, గెల్లి జయరాం, అన్వర్, మండల పార్టీ అధ్యక్షుడు చం ద్రమౌళిగౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు గాలిపెల్లి సత్యనారాయణ, ఇప్పలచ్చయ్య, లేతకారి మారయ్య, లింగంపల్లి చంద్రయ్య, మల్లేష్, ప్రవీణ్, నానయ్య తదితరులు పాల్గొన్నారు.

విప్ ఓదెలు సంఘీభావం

మందమర్రి : ఎస్సీలను వర్గీకరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎంఆర్‌పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని విప్ నల్లాల ఓదెలు శుక్రవారం సందర్శించారు. దీక్షకారులతో కొద్ది సేపు దీక్షలో కూర్చుని సంఘీభావం తెలిపారు. దీక్షలు చేపట్టిన వారిలో ఎంఆర్‌పీఎస్ జిల్లా మండల నాయకులు పెర్క నర్సయ్య, వాసాల సంపత్, సారంగరం, నల్లాల చలపతి, సాంబయ్య తదితరులు ఉన్నారు.

గిరిజనులకు కుట్టు మిషన్‌ల పంపిణీ

కాసిపేట : గిరిజన పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు బొక్కలగుట్ట అవుట్‌రిచ్ మ్యాప్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిధిగా హాజరైన టీ ఆర్‌ఎస్ మండల కన్వీనర్ రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గడ్డం పురుషోత్తంలు మాట్లాడుతూ అవుట్‌రిచ్ మ్యాప్ స్వచ్ఛంద సంస్థ గిరిజన ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలను చేపట్టడాన్ని అభినందిస్తున్నామన్నారు. అందులో భాగంగానే తుడుం గూడెం గిరిజనులకు దేవాపూర్ చర్చి ఆ వరణలో కుట్టు మిషన్‌లను పంపిణి చేశారు. దీని వల్ల మహిళలు ఇంట్లోనే ఆర్థికంగా లబ్ధిపొం దవచ్చని దేవాపూర్ చర్చిపాస్టర్ అన్నారు. మును ముందు మండలంలోని గిరిజన ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతామని వారు తెలిపారు.

'జ్ఞాన సముపార్జన ధ్యేయం'

తాండూర్ : జ్ఞాన సముపార్జనే ధ్యేయంగా స్వేరోస్ సంస్థ ముందుకు సాగుతోందని స్వేరోస్ మండల కమిటీల ఎన్నికల నిర్వహణ బాధ్యులు తీగల శ్రీనివాస్, దుస్స కుమార్‌లు అన్నారు. శుక్రవారం స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌దాస్ ఆదేశాల మేరకు స్వేరోస్ తాండూర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దాగం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పుప్పాల సురేష్, కు మార్, జనరల్ సెక్రటరీగా బేలయ్య, ట్రెజరరీగా చంద్రశేఖర్, జా యింట్ సెక్రటరీగా సంతోష్, సెక్రటరీగా మల్లేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజలింగు, కార్యవర్గ సభ్యులుగా సారయ్య, విల్సన్, శ్రీనివాస్, సురేష్, సంతోష్, కుమార్, జగదీష్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శ్రీ నివాస్, కుమార్‌లు మాట్లాడారు. అంబేద్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 5, 8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పిల్లల విజయం ఆనందం కలిగిస్తుంది.




వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు శుభప్రదం. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. సంకల్పం నెరవేరుతుంది.



మిథునరాశి:(మే21-జూన్21): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీ, సోదరుల సహకారం లభిస్తుంది.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జన సంబంధాలు విసత్రిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.




కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): దూరంలోఉన్న ప్రియతముల నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరుతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభప్రదం. సోదరీ, సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.



మకరరాశి: (డిసెంబర్22-జనవరి21): పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పింఛన్, మ్యూచ్యువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్ మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. బంధుమిత్రులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు, వినోదాల్లో పాల్గొంటారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషి

చెన్నూర్ ఎమ్మెల్యే ఓదెలు

మంచిర్యాల టౌన్ : ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషిచేస్తానని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హామీ ఇచ్చారు. తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీనివాసగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ప్రథమ మహాసభకు ఆయన హాజరై ప్రసంగించారు. ప్రతి మండల కేంద్రంలో ఆర్‌ఎంపీల సంక్షేమ భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తామన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో అసోసియేషన్ భవనానికి అనువైన స్థలం కేటాయిస్తామన్నారు.





మహాసభలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ ఓదెలు, పాల్గొన్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు

సీఎం దృష్టికి సమస్యలు

మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వపరంగా పారా మెడికల్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శిక్షణ కేంద్రాలను మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రెండు జిల్లాలకు కనీసం ఒక సొసైటీ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తాము శాయ శక్తుల కృషి చేస్తామని, ప్రభుత్వం కూడా తమకు అండగా ఉండాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 40వేల మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తుండగా జిల్లాలో 1200 మంది ప్రజలతో మమేకమై ఉన్నారన్నారు.

సమైక్య రాష్ట్రంలో ఆర్‌ఎంపీలకు అన్యాయం

సమైక్య రాష్ట్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు సరైన న్యాయం జరగ లేదన్నారు. ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తే వైద్య పరమైన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. గ్రామీణ మహిళలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పురుడు పోసుకునేలా ప్రచారం నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా కేసీఆర్ కిట్టు పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల మహిళ లను డెలివరీల కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పిస్తామన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొండయ్య సభాధ్యక్షుడిగా వ్యవహరించిన ఈ సమావేశంలో మంచిర్యాల జడ్పీటీసీ రాచకొండ ఆశాలత, ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాలరాజు, గౌరవ అధ్యక్షుడు పీ హనుమంతరావు, కో శాధికారి రాజాగౌడ్, గౌరవ స లహాదారు బీ వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి పీ రవీంద్రచారి, జిల్లా ప్రధానకార్యదర్శి బీ శ్రీనివాస్, ముఖ్య సలహాదారు ఎన్ ధనుంజయ, కుమ్రంభీం జిల్లా అధ్యక్షుడు అజయ్, మంచిర్యాల పట్టణ కమిటీ అధ్యక్షుడు చిప్పకుర్తి ఐలయ్య, ప్రధానకార్యదర్శి బీ వెంకటేష్ రెండు జిల్లాలకు చెందిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

లొద్దిగూడలో రక్త నమునాల సేకరణ

లింగాపూర్ : కుమరంభీం జిల్లా లింగాపూర్ మండలం లొద్దిగూడలో కిడ్నీ వ్యాధి బాధితులపై ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో 'తెలంగాణ ఉద్ధానం' అనే శీర్షికన వచ్చిన కథనానికి అన్ని శాఖల అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో పర్యటించి కిడ్నీ వ్యాధికి గల మూలాలను కనుగొనేందుకు ప్రయత్నం చేశారు. తహసీల్దార్ బాబుసింగ్, తిర్యాణి మండల వైద్య సిబ్బంది గ్రామాన్ని సందర్శించి సమస్యలను పరిశీలంచారు. గ్రామస్థులు తాగే నీటి వనరులను బోరు బావులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో గ్రామంలో ప్రతి ఒక్కరి రక్త నమునాలు సేకరించారు. ఈ నమునాలతో వ్యాధి గల మూలాలను తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ గ్రామంలో సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరి నుంచి రక్తనమునాలు, బరువు, ఎత్తు, ఆరోగ్య స్థితి అన్ని రకాల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రకాష్, సర్పంచ్ సులోచన సంతోష్, గ్రామ నాయక్ మంగులాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



లొద్దిగూడలో గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

నేడు నిమ్స్ బృందం రాక...

శనివారం హైదరాబాద్ నుంచి నిమ్స్ ఆసుపత్రి వైద్య నిపుణుల బృందం లొద్దిగూడ గ్రామాన్ని సందర్శించనుంది. ఇందుకు సంబంధించి కుమరంభీం జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు ఏర్పాట్లు చేస్తున్నారు.

రేపు టీయూటీఎఫ్ రాష్ట్ర విద్యాసదస్సు

మంచిర్యాల టౌన్ : టీయూటీఎఫ్ ఏడో ఆవిర్భావ దిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 6న రంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర విద్యాసదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లింగంపెల్లి ప్రేంరావు, భన్న రవీందర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర మంత్రి మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ సునితా మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యాసదస్సులో విద్యారంగానికి సంబంధించి చర్చ ఏర్పాటు చేస్తున్నందున జిల్లాలోని సంఘ శ్రేణులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కేసీఆర్ మాయల మరాఠి

• కేంద్రం అందించే నిధులు మింగేస్తున్నాడు • బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మారావ్

లక్షెట్టిపేట : ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ మాయల మరాఠి అని బీజేపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మారావ్ విమర్శించారు. శుక్రవారం లక్షెట్టిపేట ఎస్ ఆర్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర పథకాలను రాష్ట్ర పథకాలు గా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. మోదీ ప్రధానిగా దేశానికి ఎన్నో సేవలందిస్తున్నారన్నారు. అవినీతి రహిత స్వచ్ఛపాలనను దేశంలోనే మొదిటిసారిగా అందిస్తున్న గొప్ప ప్రధానిగా అభివర్ణించారు. నీతి అయోగ్ ద్వారా రాష్ట్రాలకు నేరుగా నిధులను అందిస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వాటిని దుర్వినియోగం చేస్తోందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి దమ్ము వుంటే కేంద్రం అందించే నిధుల లెక్కలు పైసాతో వివరిస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లక్షమందికి ఉద్యోగాలు కల్పిస్తానని ప్రగల్బాలు పలికిన ముఖ్యమంత్రి ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారో ఇప్పటికీ అయోమయంగా వుందన్నారు.



మాట్లాడుతున్న పద్మారావ్

కోట్లా రూపాయల నిధులు స్వాహా

డబుల్‌బెడ్ రూం, మిషన్‌భగీరథ, మిషన్‌కాకతీయ పథకాల పేరిట కోట్లాది రూపాయల సొమ్ముని మింగేస్తున్నారన్నారు. పిల్లతల్లికి కేంద్రం ఆరువేల ఆర్థిక సాయం అందిస్తుంటే వాటికి కొంత సొమ్ము కలిపి కేసీఆర్ పథకంగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటున్నారు. త్వరలోనే బీజేపీ కారకర్తలు ప్రతి గ్రామం తిరిగి తెలంగాణ ప్రభుత్వం ఆయా గ్రామాలకు ఎన్ని నిధులిచ్చిందో, ఎంత అభివృద్ధి చేసిందో లెక్కలతో సహా బయటకు తీస్తామన్నారు. కేసీఆర్ అవినీతి బాగోతంపై ప్రధాని మోదీ ఏదో రోజు కన్నెర్ర జేయడం తథ్యమన్నారు. ఆ రోజు కేసీఆర్ అసలురంగు బయటకు వస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రాజ మొగిలిగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మున్నారాజ్‌సిసోడియా, అర్మల్ల పోశం, కొయ్యాల ఏమాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్‌గౌడ్, అందుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుండా సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ కేశవరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు బొప్పుసతీష్, పట్టణ అధ్యక్షుడు నరేశ్‌చంద్‌జైన్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జాతీయ సంఘాలను విమర్శించే నైతిక హక్కు లేదు'

గోదావరిఖని: సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు సాధించలేని టీబీజీకేఎస్ నాయకులకు జాతీయ కార్మిక సంఘాలను విమర్శించే నైతిక హక్కు లేదని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు వేల్పుల నారాయణ, కార్యదర్శి మేరుగు రాజయ్య, బ్రాంచ్ కార్యదర్శి మడ్డి ఎల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా టీబీజీకేఎస్ నాయకులు అనవసరపు విమర్శలు మానుకోవాలని లేని పక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

'రిటైర్డ్ కార్మికులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

కాల్వశ్రీరాంపూర్: రిటైర్డ్ సింగరేణి కార్మికులకు ప్రభుత్వం రూ.10 వేలకు తగ్గకుండా పెన్షన్ ఇవ్వాలని రిటైర్డ్ సింగరేణి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిర్వట్ల నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం రిటైర్డ్ సింగరేణి ఉద్యోగుల డివిజన్ స్థాయి సమవేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా అధ్యక్షుడు నిర్వట్ల నర్సయ్య మాట్లాడుతూ 9వ వేజ్ బోర్డు ప్రకారం రిటైర్డ్ ఉద్యోగుల భార్యభర్తలు ఆసుపత్రుల్లో చికిత్సల కోసం ఒక్కొక్కరికి 20 వేల చొప్పున ఇద్దరికి 40 వేలు కట్టాలని సింగరేణి యాజమాన్యం జరిగిందన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు నామమాత్రంగానే పెన్షన్లు వస్తున్నాయని ప్రభుత్వం భార్యభర్తలకు ఉచితంగా 25 లక్షల వరకు వైద్య సేవలు అందివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 1983లో ఎన్‌టీఆర్ పాలనలో 1.26 లక్షల మంది ఉద్యోగులు సింగరేణిలో ఉంటే కేసీఆర్ పాలన వచ్చే సరికి కేవలం 50 వేల మంది మాత్రమే ఉన్నారన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా డీఆర్ చెల్లించాలన్నారు. 20 సంవత్సరాల సర్వీస్ ఉన్న వారికి రెండు సంవత్సరాల వెయిటేజ్ ఇవ్వాలన్నారు. ఎగ్జిక్యూటివ్ పెన్షనర్లు, ఉద్యోగుల పెన్షనర్ల మధ్య వైద్య వసతులతో వివక్ష ఉండకుండా మెడికేర్ స్కీంలో అందరికీ ఒకే అవకాశం ఉండాలన్నారు. సర్వీస్‌తో నిమిత్తం లేకుండా అంగవైకల్యం పొందిన వారికి పెన్షన్ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రావుల ఓదెలు, బైరి శంకర్; మాస రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు చిలువేరు రాజయ్య పాల్గొన్నారు.

50,79,214 మొక్కలు నాటిన సింగరేణి

ఆంధ్రజ్యోతి, మంచిర్యాల: సింగరేణిలో జూలై 12 నుంచి ఈ నెల 4 వరకు ఆరు జిల్లాల్లోని 11 ఏరియాల్లో 50,79,214 మొక్కలను నాటినట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల ఆఖరులోగా కోటి మొక్కలు నాటుతామని సీఎండీ ఎన్ శ్రీధర్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లిలో 1,98,250, భద్రాద్రి కొత్తగూడెంలో 2,97,454, కార్పోరేట్‌లో 1,53,327, ఇల్లందులో 2,70,250, మణుగూరులో 2,59,000, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం-1లో 2,11,000, రామగుండం-2లో 2,49,000, రామగుండం-3లో 1,85,000, జయశంకర్ భూపాలపల్లిలో 4,87,000, మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో 2,45,833, మందమర్రిలో 2,19,000, కుమరంభీం జిల్లాలోని బెల్లంపల్లి, గోలేటిలలో 3,69,500ల మొక్కలు నాటామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే-5,5బీ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం గని అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య మాట్లాడుతూ ఉత్పత్తి కోసం కృషి చేసిన కార్మికుల సమస్యలు తీర్చడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన విషయాలపై అధికారులు సరిగా దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. ఆర్కే-5బీ గనిలోని 3ఎన్-6 ప్యానెల్ 47డిస్ట్రిక్ట్ 3సీమ్, బీఎన్-6ప్యానల్ 47డిస్ట్రిక్ట్ 4సీమ్‌లో సరిపడా గాలి లేని కారణంగా కార్మికులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పని స్థలాలకు వెళ్లాలంటే సరైన దారి, తంతెలు లేవన్నారు. హాలర్ల వద్ద గాలి లేక హాలర్ ఆపరేటర్లు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎస్‌డీఎల్ యంత్రాల స్పేర్‌స్పార్ట్స్ లేక ఉత్పత్తికి ఆటంకం కలుగుతుందని, నాణ్యమైన పని ముట్లు అందించి ఆపరేటర్ల ఇబ్బందులు తొలగించాలన్నారు. కోల్‌కట్టర్, ఇతర పేస్‌వర్కర్ కార్మికులకు ఇన్సెంటివ్ రావడం లేదన్నారు. క్యాంటిన్‌లో మెనూ ప్రకారం నాణ్యమైన తినుబండారాలను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సర్ఫేస్ లైటింగ్ లేక కార్మికులు రాత్రివేళ భయాందోళనకు గురవుతున్నారని, మెయిన్ రోడ్ నుంచి మైన్ వరకు, మ్యాగ్జిన్ వరకు లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ల్యాగల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బియ్యాని శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మేకల దాసు, అడ్లూరి చంద్రయ్య, లింగయ్య, నర్సయ్య, రాజబాబు, రాజేశం, సాయిలు పాల్గొన్నారు.

660 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి చర్యలు

- సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్

ఆంధ్రజ్యోతి, మంచిర్యాల: 2017-18 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 660 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యం సాధించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. 11 ఏరియాల జనరల్ మేనేజర్లు, డైరెక్టర్లతో సింగరేణి భవన్‌లో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ నాగయ్య తెలిపారు. ఏరియాల వారీగా ఒక్కో జీఎంతో సీఎండీ సమీక్ష నిర్వహించి లక్ష్యాల సాధనకు గల అవరోధాలు, పరిష్కార మార్గాలు అప్పటికప్పుడే డైరెక్టర్‌లతో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఏడాది ఇతర రాష్ట్రాల విద్యుత్ కర్మాగారాల నుంచి కూడా సింగరేణి బొగ్గుకు మంచి డిమాండ్ వచ్చిందన్నారు. వినియోగదారుల ఒప్పందాల ప్రకారం బొగ్గు అందించడానికి కృషి చేయాలని జీఎంలతో సీఎండీ పేర్కొన్నారు.



జీఎంలు, డైరెక్టర్లతో సమావేశమైన సీఎండీ శ్రీధర్

హరితహారంలో కోటి మొక్కలు నాటాలి.....

హరితహారంలో మూడో విడతలో కోటి మొక్కలను నాటే లక్ష్యాన్ని అన్ని ఏరియాల జీఎంలు సాధించాలని సీఎండీ శ్రీధర్ ఆదేశించారు. కోటి మొక్కల లక్ష్యాన్ని చేరడానికి ఉద్యోగులు, కార్మికుల సహకారాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్స్ పవిత్రన్‌కుమార్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ బీ భాస్కర్‌రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎస్ చంద్రశేఖర్, డైరెక్టర్ ఈ అండ్ ఎం ఎస్ శంకర్, కోల్ మూమెంట్ ఈడీ ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు శ్రీరాంపూర్‌లో ఎస్‌సీఎంఈయూ ప్రథమ మహాసభలు

- వారసత్వం అమలు, కార్మికుల హక్కుల సాధనకు కార్యచరణ
- హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు రమేశ్

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ కోల్‌మైన్స్ మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రథమ మహాసభలు ఆదివారం శ్రీరాంపూర్‌లోని సేవా భవన్ వద్ద నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు పేరం రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రథమ మహాసభల్లో కార్మికులకు వారసత్వ ఉద్యోగాల అమలుపై దీక్షలు, మలిదశ పోరాటాలు, 30శాతం లాభాల వాటా పంపిణీ, బదిలీ వర్కర్లను పర్మినెంట్ చేయడం, యాక్టింగ్ కార్మికులకు ప్రమోషన్లు, క్యాడర్ స్కీం అమలు చేయడంపై కార్యచరణ రూపొందించేందుకు తీర్మాణాలు చేస్తామన్నారు. శ్రీరాంపూర్‌లో టీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఇచ్చిన హామీలైన మెడికల్ కళాశాల, మైనింగ్ కళాశాల వాగ్దానాలు తీర్చలేదన్నారు. సంస్థలో పనిచేస్తున్న అంతర్గత కార్మికులు సాంకేతిక విద్యలో కరస్పాండెంట్స్ కోర్సు చేయాలని ప్రోత్సహించిన యాజమాన్యం ప్రస్తుతం వారికి ఎన్‌ఓసీ ఇవ్వకుండా వేధిస్తుందన్నారు. సేఫ్ నిధులను సింగరేణి ప్రభావిత గ్రామాల్లో కాకుండా ఇతర జిల్లాల్లో మిషన్ భగీరథకు కేటాయిస్తూ బొగ్గు గనుల ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాట కార్యక్రమాలు నిర్ణయిస్తామన్నారు. ఈ ప్రథమ మహాసభలకు యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఢిల్లీలోని ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రావు, నర్సయ్య, రెబ్బ రామారావు, సింగరేణి విభాగం ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రథమ మహాసభల్లో రీజియన్, డివిజన్ స్థాయి కమిటిలను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంఎస్ కార్యదర్శులు తిరుపతిగౌడ్, రాజేంద్రప్రసాద్, కరీముల్లా, వినయ్, వెంకన్న, డివిజన్ నాయకులు సతీష్, కాల్వ శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, అశోక్‌కుమార్, మేకల స్వామి, మల్లన్న, భీమయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటం'

మందమర్రి: కార్మిక సమస్యల సాధన కోసం సమరశీల పోరాటాలు తప్పవని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. అయినప్పటికి గుర్తింపు సంఘం వాటి పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బోనాల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెల్ది సుదర్శన్, నోముల లక్ష్మణ్, ఎం శ్రీనివాస్, టీ అంజన్న, శెగ్గం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

లాభాల్లో 30శాతం వాటా ఇవ్వాలి

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి 30 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వై.గట్టయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి సాధించి ఆరు నెలలు గడిచినప్పటికీ లాభాలను ప్రకటించక పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. లాభాల వాటా కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా సీఎండీ స్పందించి లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

'కార్మికుల హక్కుల సాధనలో టీబీజీకేఎస్ విఫలం'

యైటింక్లయిన్‌కాలనీ: కార్మికుల హక్కుల సాధనలో టీబీజీకేఎస్ విఫలమైందని ఏఐటీయూసీ నాయకులు ప్రకాష్, అన్నారావు, రాజారత్నం, శ్యాంసన్, సత్యనారాయణలు ఒక ప్రకటనలో విమర్శించారు. వేజ్‌బోర్డు విషయంలో జాతీయ సంఘాలను విమర్శించే హక్కు టీబీజీకేఎస్‌కు లేదన్నారు. కార్మికులు పొందుతున్న హక్కులు, వేతనాలు జాతీయ సంఘాలు సాధించిన విషయాన్ని టీబీజీకేఎస్ నాయకుడు రాజిరెడ్డి గమనించాలన్నారు. జాతీయ సంఘాల ఒప్పందం ప్రకారం జనవరి నుంచి ఎస్ఎల్‌పీ ప్రమోషన్లు అమలు చేయాల్సి ఉండగా ఎందుకు అమలు చేయించడంలేదని ప్రశ్నించారు. లాభాల వాటాపై ప్రకటన చేయించలేని టీబీజీకేఎస్ జాతీయ సంఘాలను తప్పుపట్టడం సరికాదన్నారు.

పీఆర్సీపై జస్టిస్ సతీష్‌చంద్ర కమిటీ సిఫారసుల సమర్పణ

- బొగ్గు సంస్థల్లో అధికారులకు ఇవే సిఫార్సుల వర్తింపు
- జనవరి 2017 నుంచి మూడో పీఆర్సీ అమలు

(ఆంధ్రజ్యోతి-మంచిర్యాల)

ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అధికారుల పీఆర్సీపై జస్టిస్ సతీష్ చంద్ర నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ సిఫారసులను ప్రభుత్వానికి సమర్పించింది. ఇదే సిఫారసులు దేశంలోని బొగ్గు సంస్థలకు కూడా వర్తిస్తాయి. దీని ప్రకారం వేతన పెంపు ఉంటే జనవరి 1, 2017 నుంచి అమలు చేస్తారు. పది సంవత్సరాల పాటు దీని కాల పరిమితి ఉంటుంది. ప్రస్తుతం ఈ1 అధికారికి రూ.16,400 నుంచి రూ.40,500 కనీస వేతనం ఉండగా రెకమండేషన్ ప్రకారం 40 వేల నుంచి 1,40,000లు కనీస వేతనం ఉంటుంది. ఈ2 అధికారికి 20,600 నుంచి 46,500 ప్రస్తుతం ఉండగా 50 వేల నుంచి 1,60,000లు ఉంటుంది. ఈ3కి 24,900 నుంచి 50,500 ఉండగా 60 వేల నుంచి 1,80,000లు ఉంటుంది. ఈ4కు 29,100 నుంచి 54500 ఉండగా 70 వేల నుంచి 2 లక్షలు ఉంటుంది. అదేవిధంగా ఈ 5కు 32900 నుంచి 58000 ఉండగా 80 వేల నుంచి 2 లక్షల 20 వేలు ఉంటుంది. ఈ 6కు 36600 నుంచి 62 వేలు ఉండగా కొత్తవి 90 వేల నుంచి 2,40,000. ఈ 7కు 43200 నుంచి 66 వేలు ఉండగా లక్ష నుంచి 2,60,000 కానుంది. ఈ 8కి 51,300 నుంచి 73 వేలు ఉండగా 1,20,000ల నుంచి 2,80,000లకు, ఈ-9లో 62 వేల నుంచి 80 వేలకు ఉండగా 1,50,000ల నుంచి 3 లక్షలకు ప్రతిపాదించారు. డైరెక్టర్ జీతాలు ప్రస్తుతం 43,200 నుంచి 66 వేలు ఉండగా నూతనంగా లక్ష నుంచి 2,60,000లకు ప్రతిపాదించారు. ఇలా సీఎండీ జీతాలు ప్రస్తుతం 80 వేల నుంచి 1,25,000లు ఉండగా 2 లక్షల నుంచి 3,70,000లకు ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ రాజేష్‌కుమార్ చౌదరి సంతకం చేశారు. అయితే పెర్క్స్, ప్రాఫిట్ బిఫోర్ ట్యాక్స్‌కు సంబంధించిన పరిమితులు, ఇతర అలవెన్సుల వివరాలు కూడా ఇందులో ఉన్నాయి. వీటన్నింటిపై ఆమోద ముద్ర పడితే జీతాలు మాత్రం అధికారులకు భారీగానే పెరిగే అవకాశం ఉంది.



ఆదివాసీ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఆదివాసీ దినోత్సవ పోస్టర్ల విడుదల

(ఆంధ్రజ్యోతి, మంచిర్యాల)

ఈ నెల 9న ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టనున్న కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు, గోడ ప్రతులను కలెక్టర్ ఆర్వీ కర్ణన్ శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక, డీటీడీఓ మడావి గంగారాం, మంచిర్యాల ఆదివాసీ సంఘం గౌరవ అధ్యక్షుడు నైతం లక్ష్మణ్, అధ్యక్షుడు మడావి శంకర్, ఆడ జంగు, ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు వెడ్మ కిషన్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కుడిమెట తిరుపతి, ఈగం మారయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో రీ సైక్లింగ్‌కు అవకాశం లేదు

● కలెక్టర్ ఆర్వీ కర్ణన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

మంచిర్యాల క్రైం: గొర్రెల పంపిణీలో జిల్లాలో రీసైక్లింగ్‌కు ఎలాంటి అవకాశం లేదని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో లబ్ధిదారులకు 5,500 యూనిట్లు అందజేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 676 గొర్రెల యూనిట్లకు అందజేసినట్లు చెప్పారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్, షోలాపూర్ ప్రాంతాల నుంచి పశు సంవర్ధక అధికారుల ద్వారా తెప్పించి, లబ్ధిదారులకు అందజేశామన్నారు. స్వయంగా మారుమూల ప్రాంతాలకు వెళ్లి గొర్రెల పెంపకందార్లను కలిసి, నాణ్యమైన గొర్రె పిల్లలను ఎంపికచేసి తెచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెలు తెచ్చేందుకు రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు దాటాల్సి వస్తున్నందున రవాణాలో ఆలస్యమవుతుందన్నారు. గొర్రెల పంపిణీకి యాదవ, కుర్మ సంఘాల వారు సంహకరించాలని కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

'కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవాలి'

నెన్నెల: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీపీసీసీ కార్యదర్శి మత్తమారి సూరిబాబు పిలుపునిచ్చారు. నెన్నెల మండలకేంద్రంలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మట్లాడారు. కష్టపడే వారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. అందరూ కలిసికట్టుగా ముందుకు పోవాలన్నారు. గడప గడపకూ వెళ్లి పార్టీ సభ్యత్వాలు చేయించాలన్నారు. టీఆర్ఎస్ రాక్షస పాలన గూర్చి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ చిలుమల శంకర్, జిల్లా నాయకులు జయరాం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అబ్జల్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కంకట శ్రీనివాస్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెల్లి జయరాం, మైనార్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు అన్వర్, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళిగౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకులు చెన్నోజి శంకరయ్య, కంపెల రమేశ్ డోలె సునీత, దుర్గం స్వప్న, కీర్తి లక్ష్మన్ పాల్గొన్నారు.

కాటికి దగ్గర.. కూ(గూ)టికి దూరం!

● తరుముతున్న కన్నబిడ్డలు
● అలమటిస్తున్న పండుటాకులు
● చరమాంకంలో ఒంటరి పోరు
● జిల్లాలో పెరుగుతున్న ఘటనలు



◄ జిల్లాలోని షేడ్స్ వృద్ధాశ్రమం

(ఆంధ్రజ్యోతి - మంచిర్యాల)

'అయ్యా కలెక్టర్‌గారూ.. నాకు ఇద్దరు కొడుకులు. ఇద్దరూ సర్కారు నౌకరే చేస్తున్నరు. పదేండ్ల క్రితం నా భర్త చనిపోయిండు. ఇన్నాళ్లూ ఒంటరిగా బతికిన. ఇప్పుడు చాతనైతలేదు. బుక్కెడు బువ్వ పెట్టుమని అడిగితే కొడుకులిద్దరూ ఇంట్లోంచి గెంటేశారు. మీరే ఏదైనా దారి చూపండి..' ఇటీవల అమృతమ్మ అనే ఓ వృద్ధురాలు ప్రజావాణి సాక్షిగా కలెక్టర్ కర్ణన్‌కు ఇలా మొరపెట్టుకున్నది.

'కలెక్టర్‌గారూ.. మా తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యిండు. అమ్మా నాన్న మంచం మీద ఉన్నరు. మా అన్నలిద్దరూ ఆస్తి తమ పేరు మీద రాయించుకున్నరు. మంచి ఉద్యోగాలు చేస్తున్నరు. అయినా తల్లిదండ్రులకు బుక్కెడు బువ్వ పెడ్తలేరు. ఎలాగైనా మీరేవారికి బుద్ధిచెప్పాలి..' అంటూ ముగ్గురు సోదరీమణులు కూడా అదే ప్రజావాణి వేదికగా కలెక్టర్‌ను వేడుకున్నారు.

● లెక్కలేనన్ని ఫిర్యాదులు..

జిల్లాలో ఇలాంటి ఫిర్యాదులు ఇటీవలికాలంలో పెరిగిపోతున్నాయి. కాటికి కాళ్లు జాపిన వయస్సులో కన్నబిడ్డలు ఇంట్లోంచి గెంటి వేస్తుండడంతో జిల్లాలో వందలాది వృద్ధుల పరిస్థితి దయనీయంగా మారింది. వయస్సుతో పాటు పెరిగి పెద్దవయిన రోగాలు ఇబ్బంది పెడుతుంటే, కూటికి, గూటికి దూరమై దుర్భర బతుకులు బతుకుతున్నారు.

● ఆస్తిపాస్తులు పంచి ఇచ్చి..

వృద్ధాప్యం మీద పడగానే కొడుకులు, బిడ్డలు ఆస్తులు పంచి ఇచ్చేదాకా వదలడం లేదు. ఉన్న ఆస్తిపాస్తులు పంచి ఇచ్చాక బుక్కెడు బువ్వ కూడా పెట్టడం లేదు. రోగమొస్తే వైద్యం చేయించే దిక్కులేదు. కొందరు ఇంట్లోంచి గెంటివేస్తుండగా, మరికొందరు సమాజం బాధకు ఇంట్లో ఉంచుకుంటూ ప్రత్యక్ష నరకం చూపుతున్నారు. ఇంటిలోపలికి రానివ్వకుండా ఆరుబయట గుడిసెలోనే, రేకుల కిందో, కారిడార్‌లోనో, మరుగుదొడ్ల పక్కనో మంచం వేసి వేరుగా ఉంచుతున్నారు. కప్పుకోవడానికి కనీస దుప్పట్లు ఇవ్వడం లేదు. ఏదైనా ఉద్యోగం చేసి విరమణ పొందినవారికి పెన్షన్ వస్తుండడంతో దాని కోసం బాగా చూసుకుంటున్నా ఏ ఆధారం లేని వారి పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది.

● పెరుగుతున్న వృద్ధాశ్రమాలు..

కన్నబిడ్డలు సూటిపోటి మాటలతో వేధిస్తుండడం, తరిమికొడుతుండడంతో చాలా మంది వృద్ధులు ఇల్లు విడిచి బయటకు వస్తున్నారు. వారిలో కొందరు కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. అధికారులు, పోలీసులు వారి కొడుకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా, ఆ వెంటనే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తున్నది. దీంతో దిక్కులేక రోడ్లపై పడుతున్నారు. ఎవరైనా దయతలచి వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తే కన్నబిడ్డలను తలుచుకుంటూ భారంగా బతుకీడుస్తున్నారు. ఇలాంటి వృద్ధులను పలువురు మానవతామూర్తులు అక్కున చేర్చుకుంటుండగా, జిల్లాలో రోజురోజుకూ వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్నాయి.

● 45 శాతానికి పైగా ఒంటరి వ్యథ!


దేశవ్యాప్తంగా 'ఏజ్‌వెల్ ఫౌండేషన్' అనే సంస్థ నిర్వహించిన ఒక సర్వేలో 45 శాతానికి పైగా వృద్ధులు కన్నబిడ్డల ఆదరణ కరువై, ఒంటరి జీవితం గడుపుతున్నట్లు తేలింది. ఈ సందర్భంగా వృద్ధుల సంక్షేమానికి, సాధికారతకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని ఆ సంస్థ స్పష్టం చేసింది. 60 ఏండ్లకు పైబడిన వారందరికీ ఆర్థిక ఆసరా ఇవ్వాలని సర్కారుకు సూచించింది. వృద్ధుల సంక్షేమం కోసం జాతీయ నిధి, జాతీయ కమిషన్ ఏర్పాటు చేయాలని అభిప్రాయపడింది.

● అవమానాలను తట్టుకోలేక..
-చల్ల శంకరయ్య



బొగ్గు బాయిలో పనిచేసిన. పెండ్లి కాలేదు. మా అక్క ఉన్నన్ని రోజులు బాగానే చూసుకున్నది. నా దగ్గర ఉన్న ఆస్తిపాస్తులన్నీ ఆమె పిల్లల కోసం ధారపోసిన. చేతగాకుంట అయినంక ఆమె పిల్లలు అవమానించసాగారు. సూటిపోటి మాటలతో వేధించారు. భరించలేక ఈ వృద్ధాశ్రమానికి వచ్చిన.

● దావఖాన్ల వదిలేసిన్రు..
-భూనేని మాంతయ్య



కష్టపడి పిల్లలను పెంచి పెద్ద చేసిన. ఓ రోజు ఇంట్లో దొంగలు పడి కొట్టిన్రు. దవాఖాన్ల చేరిన. నా మానాన నన్ను వదిలేసి వెళ్లిపోయిన్రు. ఏం చేయాలో తెలియక ఈ వృద్ధాశ్రమానికి వచ్చిన. కన్నబిడ్డల్లెక్క చూసుకుంటున్నరు.

● ముగ్గురుకొడుకులు ఉన్నా..
-కమలమ్మ



నాకు ముగ్గురు కొడుకులు. కోడళ్ల మాటలు పట్టుకొని నన్ను ఒంటరిని చేసిన్రు. ఇదిగో ఇక్కడికి తెచ్చి వదిలేసిన్రు. రెండేళ్లుగా ఇక్కడే ఉంటున్నా. ఏమి జేయాలె. ఏం మాట్లాడాలె. లోకం గిట్ల తయారైంది. పసి గుడ్డులను కడుపుల పెట్టుకొని సాత్తే ఇప్పుడీ గతి పట్టింది.(కంటతడి)

● కొడుకు విడిచిపెట్టిపోయిండు
-తెరవరెడ్డి తెరీసమ్మ



మాది వరంగల్ దగ్గర ఎల్కతుర్తి. భర్త చనిపోయిండు. మాకు ఒక్కడే కొడుకు. ఇక్కడనే బాయిల పని చేస్తడు. కోడలు మాటలు పట్టుకొని ఇక్కడ విడిచి పెట్టి పోయిండు. వాడు సల్లగుంటే అంతే చాలు.

రోగులకు ఎలాంటి ఇబ్బందీ కలగవద్దు

● ఐసీయూలో అన్ని సౌకర్యాలు కల్పించండి
● వైద్యులతో కలెక్టర్ ఆర్వీ కర్ణన్
● ప్రభుత్వ ఏరియాసుపత్రిలో ఆకస్మిక తనిఖీ
● బ్లడ్ బ్యాంకు, పిల్లలవార్డు పరిశీలన



ప్రసూతి వార్డులో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

మంచిర్యాల టౌన్: రోగులకు ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా చూడాలని, ఐసీయూలో అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యులను కలెక్టర్ ఆర్వీకర్ణన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని ఐసీయూను పరిశీలించారు. అక్కడ చికిత్స పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడి, వసతులు, వైద్యం అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఐసీయూలో రోగులను జాగ్రత్తగా చూసుకోవాలని, వారి అవసరాలను దగ్గరుండి తీర్చాలని, సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్‌రావుకు సూచించారు. అనంతరం బ్లడ్‌బ్యాంకుతో పాటు పిల్లల వార్డును పరిశీలించారు. బ్లడ్‌బ్యాంకులో అందుబాటులో ఉన్న వివిధ యూనిట్ల రక్తం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్లవేళలా రక్తం అందుబాటులో ఉండేలా చూడాలని బ్లడ్‌బ్యాంక్ వైద్యులు డాక్టర్ విష్ణుమూర్తికి సూచించారు. అనంతరం ప్రసూతి వార్డులో పర్యటించి మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పడకలు, ఇతర సౌకర్యాలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. వైద్యచికిత్సలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనీ, ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి ప్రియాంక, అధికారులు, వైద్యులు ఉన్నారు.



కొనసాగుతున్న పిచ్చిమొక్కలు తొలగింపు

కర్ణమామిడిలో త్వరలో మరోసారి తవ్వకాలు

మంచిర్యాల రూరల్: హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామంలోని పాటిగడ్డ ప్రాంతంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో మరోసారి తవ్వకాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం పురావస్తు శాఖ పర్యవేక్షకులు ఎర్రం రాజు భానుమూర్తి, నాగరాజు ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలోని పిచ్చి మొక్కలను తొలగించారు. శనివారం నుంచి తవ్వకాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. శాతవాహనుల చారిత్రక ఆనవాళ్లను వెలికి తీసే లక్ష్యంతో జూన్ 6న పురావస్తుశాఖ సంచాలకురాలు ఎన్ఆర్ విశాలాచ్చి, ఉప సంచాలకుడు రాములు నాయక్ ఆధ్వర్యంలో తవ్వకాలను ప్రారంభించారు. వర్షం అధికంగా పడటంతో నిలిపివేశారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో మరోసారి తవ్వకాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కోడ్ భాషలో TROUBLEను ఎలా రాస్తారు?

మెంటల్ ఎబిలిటి



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

1. ఒక కోడ్ భాషలో LAWYER ను ZHWNEC గా రాశారు. అదే కోడ్‌లో WONDER ను ఎలా రాస్తారు?
ఎ) EHWYST బి) WEYHTS
సి) TUSEWJ డి) ఏదీకాదు

2. ఒక కోడ్ భాషలో NUMBER ను ELXMHU గా రాశారు. అదే కోడ్ భాషలో UNINOR ను ఎలా రాస్తారు?
ఎ) LHLEQK బి) LQLKHE
సి) LELQHK డి) ఏదీకాదు

3. ఒక కోడ్‌లో MASTERను IVGHZNగా రాశారు. అదే కోడ్‌లో TALENTను ఎలా రాస్తారు?
ఎ) GZOGMV బి) GMVOZG
సి) GVOZMG డి) ఏదీకాదు

4. ఒక కోడ్‌లో EXCELను GBIMVగా రాశారు. అదే కోడ్‌లో SMILEను ఎలా రాస్తారు?
ఎ) IPPQT బి) IPTQP
సి) UQOTO డి) ఏదీకాదు

5. ఒక కోడ్‌లో STARను 170 గా రాశారు. అదే కోడ్‌లో UNITను ఎలా రాస్తారు?
ఎ) 92 బి) 108 సి) 126 డి) ఏదీకాదు

6. ఒక కోడ్ భాషలో PRIVATE ను BVHVOPF గా రాశారు. అదే కోడ్ భాషలో TROUBLE ను ఎలా రాస్తారు?
ఎ) CHUSPNL బి) HNCPLHU
సి) CNHUSPL డి) ఏదీకాదు

7 - 10
ఒక కోడ్ ప్రకారం HANDSOME ను 89431052 గాను, NICE ను 4672 గాను రాశారు. పై కోడ్ ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

7. NOSE కు సరైన కోడ్?
ఎ) 4012 బి) 2041 సి) 1024 డి) ఏదీకాదు

8. AIM కు సరైన కోడ్?
ఎ) 569 బి) 695 సి) 965 డి) ఏదీకాదు

9. MIND కు సరైన కోడ్?
ఎ) 5643 బి) 3456 సి) 5436 డి) ఏదీకాదు

10. HOME కు సరైన కోడ్?
ఎ) 8520 బి) 8052 సి) 5082 డి) ఏదీకాదు

11. 6, 7, 16, 51, ---------
ఎ) 208 బి) 504 సి) 416 డి) ఏదీకాదు

12. 8, 4.5, 5.5, 12.5, 52, ----------
ఎ) 416.5 బి) 418.5 సి) 420.5 డి) ఏదీకాదు

13. 8, 3, 2, 3, 10, --------
ఎ) 49 బి) 64 సి) 86 డి) ఏదీకాదు

14. 5, 4, 6, 15, 56, -------
ఎ) 285 బి) 275 సి) 280 డి) ఏదీకాదు

15. 9, 15, 43, 83, 247, -----------
ఎ) 192 బి) 921 సి) 291 డి) ఏదీకాదు

16. a - bc - ab - cdabc - da - cd - ----
ఎ) abbcdd బి) adbcbd
సి) abcdbd డి) ఏదీకాదు


17. ab - b - cacc - b - a - cb
ఎ) cbaab బి) aabbc
సి) adcab డి) ఏదీకాదు

18. d - dba - a - db - - a - ac
ఎ) bcdbcc బి) bbcccd
సి) bccdbc డి) ఏదీకాదు

19. **ప్రకటనలు:** అన్ని జిల్లాలు రాష్ట్రాలు
అన్ని రాష్ట్రాలు దేశాలు
సారాంశాలు: 1. కొన్ని దేశాలు జిల్లాలు
2. ఏ జిల్లా రాష్ట్రం కాదు
3. కొన్ని దేశాలు రాష్ట్రాలు కాదు
4. కొన్ని రాష్ట్రాలు జిల్లాలు
ఎ) 1, 4 సరైనవి బి) 1, 2, 4 సరైనవి
సి) 1, 3 సరైనవి డి) ఏవీ సరైనవి కావు


20. **ప్రకటనలు:** ఏ సెకను నిమిషం కాదు
కొన్ని నిమిషాలు గంటలు
సారాంశాలు: 1. కొన్ని గంటలు సెకన్లు కాదు
2. కొన్ని సెకన్లు నిమిషాలు కాదు
3. కొన్ని గంటలు నిమిషాలు
4. అన్ని సెకన్లు గంటలు
ఎ) 1, 3, 4 సరైనవి బి) 2, 4 సరైనవి
సి) 1, 2, 3 సరైనవి డి) ఏదీకాదు

21. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 20 బి) 22 సి) 18 డి) 14

22. కింది రేఖాచిత్రంలో ఎన్ని దీర్ఘచతురస్రాలు ఉన్నాయి?



ఎ) 8 బి) 9 సి) 10 డి) 11

23 - 25
భిన్నమైనదాన్ని తెలపండి

23. ఎ) షిల్లాంగ్ బి) ఇంఫాల్ సి) అగర్తల డి) భోపాల్
24. ఎ) 4541 బి) 3973 సి) 8167 డి) 6345
25. ఎ) RN బి)SJ సి) FV డి) PH

26 - 30
A + B అంటే A కుమారుడు B
A ÷ B అంటే A భార్య B
A - B అంటే A కుమార్తె B
A X B అంటే A భర్త B
A @ B అంటే A తల్లి B
A $B అంటే A సోదరుడు B
పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

26. A@B$C÷D సమీకరణం ప్రకారం కిందివానిలో ఏది సత్యం?
ఎ) A మేనమామ C బి) C మేనల్లుడు A
సి) D మేనకోడలు A డి) ఏదీకాదు

27. A÷B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A మామగారు C బి) D భర్త C
సి)D కుమార్తె B డి) A తండ్రి D

28. A+÷C$D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A కోడలు C బి) C భార్య B
సి) B భర్త C డి) C మామగారుA

29. A$B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కుమారుడు A బి) D కుమార్తె B
సి) A తండ్రి D డి) D భర్త C

30. A-BXC@D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కోడలు B బి) C అత్తగారు A
సి) C తండ్రి D డి) D తండ్రి C

31. SKOHRILC పదంలోని అక్షరాల స్థానాలను మారిస్తే ఒక పానీయం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి, చివరి అక్షరాలను సమాధానంగా తెలపండి
ఎ) R, I బి) H, S సి) C, R డి) ఏదీకాదు

32. కింది పదాలను నిఘంటువు ప్రకారం రాసిన తరవాత నాలుగో స్థానంలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Honey 2. Heart 3. Home
4. Health 5. Help
ఎ) Help బి) Home
సి) Heart డి) Honey


33. ENVIRONMENT పదంలో వర్ణమాల ప్రకారం ఎన్ని జతలు ఉన్నాయి?
ఎ) నాలుగు బి) మూడు సి) ఆరు డి) ఐదు

34. వర్ణమాలలోని బేసి సంఖ్య అక్షరాలను చిన్న అక్షరాలుగాను, సరి సంఖ్య అక్షరాలను పెద్ద అక్షరాలుగాను రాస్తే జనవరి నెల అక్షరాలు ఎలా ఉంటాయి?
ఎ) JaNuaRy బి)JANuary
సి) JAnuARy డి) ఏదీకాదు

35. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను అపసవ్యదిశలో రాసి రెండో సగం అక్షరాలను సవ్యదిశలో రాశారు. దీని ప్రకారం కుడి నుంచి పదో అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరాన్ని తెలపండి?
ఎ)A బి) B సి) O డి) N

36. అచ్చులు తొలగించిన వర్ణమాల ప్రకారం కచ్చితంగా మధ్యలో గల అక్షరం?
ఎ) L బి) M సి) N డి) P


(37-40)



పై డయాగ్రమ్‌లకు కింది పదాల ప్రకారం సరైన దానిని సూచించండి

37. పురుషులు, తండ్రులు, ఉపాధ్యాయులు
38. వైద్యులు, మహిళలు, ఇంజనీర్లు
39. మానవుడు, న్యాయవాది, కుర్చీ
40. గంట, నిమిషం, సెకను

41. కింది డయాగ్రమ్‌ల ఆధారంగా 2 అంకె గల ముఖానికి ఎదురుగా ఉండే ముఖంలోని అంకె?



ఎ) 5 బి) 6 సి) 3 డి) 1

42. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదేవారం వచ్చే తదుపరి నెల?
ఎ) నవంబరు బి) అక్టోబరు
సి) జనవరి డి) డిసెంబరు

సమాధానాలు

1) ఎ	7) ఎ	13) ఎ	19) ఎ	27) సి	35) బి
2) సి	8) సి	14) బి	20) సి	28) ఎ	36) సి
3) బి	9) ఎ	15) సి	21) బి	29) సి	37) బి
4) సి	10) బి	16) బి	22) బి	30) ఎ	38) డి
5) ఎ	11) ఎ	17) ఎ	23) డి	31) బి	39) సి
6) సి	12) బి	18) సి	24) సి	32) బి	40) ఎ
			25) బి	33) సి	41) బి
			26) ఎ	34) ఎ	42) డి

ఉద్యోగాలు


ఐజిఐఎంఎస్

పట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజిఐఎంఎస్)- **సీనియర్ రెసిడెంట్/ ట్యూటర్** పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు : 57
విభాగాలవారీ ఖాళీలు: అనెస్థీషియా 2, చెస్ట్ & టిబి 1, డెంటిస్ట్రీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 1, జనరల్ మెడిసిన్ - ఎమర్జెన్సీ 5, జనరల్ సర్జరీ 1, జనరల్ సర్జరీ - ఎమర్జెన్సీ 1, మైక్రో బయాలజీ 1, ఆప్తల్మాలజీ 1, ఆర్థోపెడిక్స్ 1, ఫార్మకాలజీ 1, పీడియాట్రిక్స్ 3, ఫిజికల్ మెడిసిన్ 1, సైకియాట్రీ 1, రేడియాలజీ 6, కార్డియాలజీ 8, కార్డియో థోరాసిస్ వాస్క్యులర్ సర్జరీ 2, నెఫ్రాలజీ 11, న్యూరో మెడిసిన్ 1, న్యూరో సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 1, పీడియాట్రిక్ సర్జరీ 2, యూరాలజీ 1
వయసు: ఆగస్టు 31 నాటికి 35 ఏళ్లు మించరాదు
అర్హత: ఎంసిఐ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సెంట్రల్/ స్టేట్ మెడికల్ కౌన్సెల్ గుర్తింపు పొంది ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500
ఇంటర్వ్యూ: ఆగస్టు 21 నుంచి 24 వరకు
వేదిక: Office Chamber of the Director, IGIMS, Patna - 14
వెబ్‌సైట్: www.igims.org

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా- **'గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్'** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన జిఎంఇ కోర్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా ఎనిమిది నెలల జిఎంఇ షోర్ ట్రైనింగ్, పది నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు **'ఎంఇఒ క్లాస్ 4 పార్ట్ బి'** సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.
సీట్లు: 40(జనరల్ వర్గానికి 20, ఒబిసిలకు 11, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3 సీట్లు కేటాయించారు)
క్యాంపస్: SCI' Maritime Training Institute, Powai, Mumbai
కోర్సు ఫీజు: రూ.4,50,000
స్టయిపెండ్: నెలకు రూ.15,000 ఇస్తారు
అర్హత: 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు/ ఆఖరు ఏడాది పరీక్షలు రాసి ఆగస్టు 31 నాటికి ఫలితాలు వెలవడే అవకాశం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి & పన్నెండో తరగతి లెవెల్ ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆల్ ఇండియా ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం రెండు గంటలు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, రీజనింగ్ ఎబిలిటీకి సంబంధించిన మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అడుగుతారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో అర్హత సాధించాలి. అర్హులైనవారిని ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్ట్ చేస్తారు.
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000
అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన దరఖాస్తు ఫారాన్ని ఆర్డినరీ పోస్ట్/ కొరియర్/ స్పీడ్ పోస్ట్/ రిజిస్టర్డ్ పోస్ట్ / బై హ్యాండ్ ద్వారా కింది చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
చిరునామా: Vice President I/C, Flee Personnel Dept, Third Floor, The shipping Corporation of India, Shipping House 245, Madame Cama Road, Nariman Point, Mumbai- 400021
వెబ్‌సైట్: www.shipindia.com/careers

గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

జంతు రాజ్యం, మొక్కలు - ఆర్థిక ప్రయోజనాలు


1. క్రికెట్ బ్యాట్ తయారీలో ఉపయోగించే చెట్టు?
ఎ) విల్లో బి) హోల్లీ సి) హోక్‌బెర్రి డి) వెదురు
